# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

నవంబర్ 2023

వెల : రూ.10.00



# అక్టోబరు 15 నుండి 25 వరకు
# ఆశ్రమంలో జరిగిన దసరా ఉత్సవాల దృశ్యములు



దీక్షా స్వీకరణ



అఖండ జ్యోతి
ప్రజ్వలనము



సత్సంగ సమావేశము



సత్సంగ సమావేశము

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 43 సంచిక 3
పేజీలు 44
నవంబర్ 2023

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ......................................... 5
అమ్మమాట.................................... ............ 6
విచారణ ................ ....................... ......... ........8
పరిప్రశ్నేన సేవయా ... ............ ..... .........9
విధి వ్రాత ..............................................................10
వాచాజ్ఞానం................. .................................... 11
అవతార లక్ష్యం ........................................13
జ్ఞాన నేత్రం ..............................................15
గాయత్రి మంత్రం ....................................16
గురు కృపాహి కేవలమ్ ..........................18
పుట్టినిల్లు ..............................................20
దేహభ్రాంతి ........... ................. ................. 21
మత్స్యేంద్రనాథ్............ .................................25
నారద భక్తి సూత్రాలు ................... ..............27
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ......................29
మనశ్శతకము ............................................30
నిరీక్షణ ..........................................................31
సప్తజ్ఞాన భూమికలు.....................................33
బిచ్చగాడు ............................................ ...35
గురు కృపకు అందరూ సమానులే......37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ....... ............................ ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

40) పెంపనుదల్లివై కలుష బృందసమాగమ మొందకుండ ర
క్షింపను దండ్రివై మెయి వసించు దశేంద్రియ రోగముల్ నివా
రింపను వెజ్జువై కృప గుఱించి పరంబు దిరంబుగాగ స
త్సంపదలీయ నీవెగతి దాశరథీ! కరుణాపయోనిధీ!



భావం - పోషించుటలో తల్లివి, పాపముల బొందకుండా రక్షించడంలో తండ్రివి, దేహంలో వుండే దశేంద్రియాలనే రోగమును నివారించుటలో వైద్యుడవు, దయతో శాశ్వత మోక్షమొసగి రక్షింపగా నీవే గతి దాశరథీ! కరుణాపయోనిధీ!

*దున్నపోతును నరికి తన గురుదేవునకు నివేదించినది ఎవరు?
*మానవ జీవితంలో గొప్ప మార్పును కలిగించే పుస్తకం ఏది?
*ఆటో నడిపే బాజీకి జ్వరం ఎలా తగ్గింది?
*పార్వతీదేవి పరమేశ్వరుని అడిగిన ప్రశ్నకు చేప ఎలా సమాధానం చెప్పింది?
*శృంగేరీ పీఠాధిపతుల చెంత తెల్లదొరకు కనిపించిన స్త్రీమూర్తి ఎవరు?
*త్రిమూర్తులు, యముడు, ఇంద్రుడు కలిసి కుడా చిలుకను ఎందుకు కాపాడలేక పోయారు?
*పంది జీవితాన్ని వదులుకోలేకపోయిన వారెవరు?
*పరమాత్మని దర్శించాను అన్న వ్యక్తికి, దర్శించి అనుభూతిని పొందిన వ్యక్తికి తేడా ఏమిటి?
*చాలా సంవత్సరాలు ఇసుకలోనే సమాధి స్థితిలో ఉండిపోయిన మహాత్ములు ఎవరు?
*సూక్ష్మ శరీరం ఎప్పటి వరకు ఉంటుంది?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

## శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

**4-9-1981**

ఈరోజు రాత్రి 9గం॥లకు శ్రీ బాబు భక్తులకు దర్శనం ఇచ్చారు. చాలాసేపు మౌనంగా ఉన్నారు.

కొంతసేపైన తర్వాత, "ఏమండీ, సూక్ష్మ శరీరము ఉందంటే నమ్ముతారా? మృతి చెందిన తర్వాత ఈ స్థూలదేహాన్ని దహనం చేస్తారు కదా! ఇంక సూక్ష్మ శరీరం ఎక్కడిది?" అని ప్రశ్నించి "నేను దీని విషయమై విచారణ చేయుటం మొదలుపెట్టాను. అప్పుడు చక్కని ఆలోచన వచ్చింది. మా అమ్మ నన్ను ఊరుకోనిస్తుందా! నాకు ఏదో బాధ్యత పెట్టింది. అజ్ఞానమనే చీకటిలో ఉన్న వారందరికి జ్ఞానబోధ చేయమంది."



సరే ఆ విషయాన్ని అలా ఉంచండి, నిన్న మీరంతా సీతారామ కళ్యాణం సినిమా చూశారు కదా! ఆ సినిమాలో ఒక పాత్రలో కామిక్ యాక్టరు శివరావు ఉన్నాడు. ఆ శివరావు చనిపోయాడు. మీకందరికి తెలిసినదే కదా! కాని తెరమీద మాత్రం బొమ్మ ఇంకా అలానే ఉంది, ఆడుతూ పాడుతూ వుంది. కాని ఆ బొమ్మని మనము ఏమి చేయగలము? చెరపినా చెరగదు, కోయబడదు. అలాంటిదే సూక్ష్మ శరీరము. సూక్ష్మ శరీరములోనే భూత, పిశాచ రూపాలు మానవుడు పొందుతాడు. మానవుడు ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలు రహితం అయ్యేవరకూ, సూక్ష్మరూపాన్ని కలిగి ఉంటాడు. మనస్సు అంతర్ముఖమై విషయవాంఛలు లేనివాడు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలనుండి విముక్తుడౌతాడు. సూక్ష్మ శరీరంలో బాధ వర్ణనాతీతం. దానికి ఉపశమనము లేదు. స్థూల శరీరంలోనే కొంతవరకు బాధని నివారించుకోవచ్చు. సూక్ష్మ శరీరంలో ఎంత కష్టము వుందో మీకు చెప్పను. అది దేవ రహస్యము" అన్నారు శ్రీ బాబు.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

గురు తత్త్వంలో భయానికి తావులేదు. గురుపరమాత్మ అనంత ప్రేమ స్వరూపుడు. ఆ ప్రేమను పొందటానికి భౌతికమైన ద్రవ్యంతో సంబంధం లేదు. సర్పులూ అర్ఘ్యలే! గురువాజ్ఞను ఆచరణలో పెట్టి, గురు లక్ష్యార్థముపై మనస్సు నిలిపితే ఆత్మ సాక్షాత్కారమై, సద్గురు ప్రేమను పూర్తిగా పొందగలము. స్వామి పూజకు ఏ పూజా ద్రవ్యాలతో పనిలేదు. మనస్సనే పుష్పాన్ని అర్పిస్తే భగవంతుడు తప్పక రక్షిస్తాడని శ్రీబాబూజీ ఎప్పుడూ చెబుతుండేవారు.

ఆత్మవస్తువు సాక్షాత్కారానికి అడ్డుగా నిలిచేది కల్మషమైన మనస్సు. మనస్సును శుద్ధమైనది, అశుద్ధమైనది అని రెండు రకాలుగా ఉపనిషత్తులో వర్గీకరించారు. కామ సంకల్పాలతో కూడినది అశుద్ధ మనస్సు. కామ రహితమైనది శుద్ధ మనస్సు. మానవుడిని ఇహలోకంలో బంధించటానికి మనస్సే కారణం. నారికేళంలో పువ్వు పెరిగే కొలదీ నీరు హరిస్తుంది. అలాగే విశ్వాసం ప్రగాఢంగా పెరిగేకొలదీ, కామ సంకల్పాలు హరించి, మనసు బ్రహ్మానందంలో లీనమై పోతుంది.



శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు శుద్ధమైన తమ మనస్సును బ్రహ్మానందంలో ఓలలాడించారు. కావేరీ తీరంలో ఆ మహనీయుడు శరీరస్పృహ లేకుండా ధ్యానంలో నిమగ్నమై వున్నాడు. ఆయనపై ఇసుక మేటలు పేరుకుపోయాయి. కానీ ఆ పరబ్రహ్మ స్వరూపుడికి దేహదృష్టి లేదు. అలా చాలా సంవత్సరాలు గడిచాక, భవన నిర్మాణం నిమిత్తం ఇసుకకోసం వచ్చిన వారు గునపాలతో త్రవ్వసాగారు. గునపానికి తడి తగిలింది. తీరా చూస్తే అది రక్తం! ఇసుకను జాగ్రత్తగా తొలగించి చూస్తే రక్తం ఉబికి వస్తున్న శిరస్సు కనిపించింది. తలకు గునపపు పోటు

తగిలి రక్తం స్రవిస్తున్న శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు చెక్కుచెదరని సమాధి స్థితిలో ఉన్నారు. అది మనోలయమైన సమాధి స్థితి.

మరో సందర్భంలో, సదాశివ బ్రహ్మేంద్రులవారు సదాశివుని కీర్తిస్తూ శిష్యబృందంతో కలిసి వెడుతున్నారు. ఆ ప్రాంతపు నవాబు గుడారం వైపు నుంచే వారు వెడుతున్నారు. అహంకారియైన ఆ నవాబు ఆ భక్తుడు తనకు నమస్కరిస్తాడని ఆశించి, ఆయనకు ఎదురుగా వెళ్ళాడు. అయితే సదాశివ బ్రహ్మేంద్రులవారికి బ్రహ్మం తప్ప యితరమేదీ గోచరించదు. నవాబు ఆగ్రహించి, ఆ భజన చేస్తున్న చేతులను నరికి వేయమని తన భటులను ఆజ్ఞాపించాడు. వారు నరికివేశారు.

దేహస్ఫురణ లేని ఆ మహనీయుడు తెగిన చేతులు క్రిందపడినా కూడా, తిరిగి చూడకుండా, నామస్మరణలో, దివ్య ప్రకాశంతో తేజరిల్లుతూ ముందుకు సాగిపోయాడు. దిగ్భ్రాంతి చెందిన నవాబుకు పశ్చాత్తాపం కలిగి, తెగిన ఆ చేతులను తీసుకుని, క్షమించమని వేడుకుంటూ వెంట పరుగెత్తసాగాడు.

ఆ మహనీయునికి సాష్టాంగ నమస్కారం చేసి, తాను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం విధించమని వేడుకున్నాడు. చేతులు యథాస్థానంలో పెట్టమని స్వామి చెప్పారు. సదాశివుని కృపతో అవి తిరిగి అతుక్కు పోయాయి!

గురుతత్త్వంలో భయానికి తావులేదు. భయభీతుడైతే మాయ ఆవరించినట్లే. అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామ ఆరంభంలో మాయ, భయ, మోహ, విషాదాలకు గురి అయినాడు. అప్పుడు గీతాచార్యుడు కరుణించి, తన విశ్వరూపాన్ని చూపించి, అర్జునుని కార్యోన్ముఖునిగా చేశాడు.

మనస్సును కామ రహితంగా చేసుకుని, బృందావనంలో అపూర్వ నిధిగా ప్రకాశిస్తున్న సద్గురుదేవులను స్మరిస్తూ, భక్తి పారవశ్యంతో వైరాగ్యంతో ఆత్మానందాన్ని ఆస్వాదించాలి.

అట్టి గురుపాదుకలు అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి మనందరినీ సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# విచారణ

-ఎన్. కుట్టీ

"గురుబోధని ఆకర్ణాంతం వినాలి. విన్నదాన్నిని మననం చేయాలి. తరువాత నిదిధ్యాసలోకి తెచ్చుకోవాలి" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్. ఏ విధంగా వినాలి? దానికి శ్రీ గురుదేవులు "ఆవు అనపచేనులో గబా గబా మేస్తుంది. ఆ తరువాత ఒక చెట్టు క్రింద కూర్చుని నెమరువేస్తుంది. గురుబోధ శ్రవణం అలా చేయాలి" అని వుద్బోధించారు. అందువలన వేదాంత సాధనకి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు ముఖ్యం.

అలా గురుబోధను శ్రవణము చేసిన పిదప శిష్యులందరూ చేరి విచారణ చేయాలి. దానివలన నీలో గురుబోధ స్థిరపడిపోతుంది. ఒకవేళ అది సాధ్యం కాకపోతే నీలో నువ్వు విచారణ చేయాలి. సాధనలో ఇంకొక మెట్టు దానిని అనుభవానికి తెచ్చుకోవటం.

శ్రీ కాళీవనాశ్రమంలో నిర్వహించే ధ్యాన సప్తాహ శిబిరాలలో "ధ్యానంలో మీరు విన్న గురుబోధను విచారణ చేయండి. మీ మనస్సు అ బోధలో నిల్చిపోయి ప్రశాంత స్థితిని పొందుతుంది" అని శ్రీ మాతాజీవారు చెప్పియున్నారు.

సాధకుడైనవాడు సాధన చతుష్టయాన్ని అభ్యాసం చేయాలి. నిత్యానిత్య వివేకము, ఇహాముత్ర ఫలభోగ విరాగము, శమదమాది షట్క సంపత్తి, ముముక్షుత్వము అని ఇవి నాలుగు. సాధన చతుష్టయాన్ని అభ్యసించి వానిని "అధికారి" అంటారు. అట్టివాడే జ్ఞానానికి అర్హుడు.

ఈ కనిపించే ప్రపంచము అశాశ్వతము. శాశ్వతమైనది సత్యవము, నిత్యము అయిన బ్రహ్మ పదార్థమొక్కటే అని తెలుసుకోవటాన్నే "నిత్యానిత్య వివేకము" అంటారు.

ఇహంలోను పరంలోను గల వస్తువులపై గల వైరాగ్యమే ఇహాముత్ర ఫల భోగ విరాగము అంటారు.

శమము(అంతరింద్రియ నిగ్రహము), దమము(బాహ్యేంద్రియ నిగ్రహము), ఉపరతి(విషయములపై కోరిక లేకుండుట), తితీక్ష(దుఃఖములలో సహనము కలిగియుండుట), శ్రద్ధ(గురు వాక్యములపై శ్రద్ధ), సమాధానము(జ్ఞానము) - ఈ ఆరింటిని శమదమాది షట్క సంపత్తి అని అంటారు.

ముక్తి పొందాలనే తీవ్ర ఆకాంక్షయే ముముక్షుత్వము.

ఇలా సాధన చతుష్టయాన్ని సాధించిన తరువాత సమర్థులైన గురువులను ఆశ్రయించాలి. వారు చేసిన ఉపదేశాన్ని ఎంతో శ్రద్ధతో సాధన చేయాలి. అప్పుడు మన మనస్సు ప్రశాంతత చెంది ఆత్మలో లయమవుతుంది. మనోలయమే ముక్తి!

## పరిప్రశ్నేన సేవయా - కీ.శే. పరాశర ప్రసాద్

సద్గురు దేవులు అమెరికాలో సత్సంగ సమావేశంలో బోధ చేస్తుండగా ఒక భక్తుడు లేచి, 'మీరు భగవంతుణ్ణి దర్శించారా?' అని ప్రశ్నించి, నవ్వుతున్నాడు.

సద్గురు దేవులు ఆ వ్యక్తి నవ్వు వెనుక ఉన్న ద్వంద్వభావాలను గ్రహించారు. "నేను భగవంతుడిని దర్శించానా? అనే సందేహం వలన వచ్చిన ప్రమాదము ఏమిలేదు కాని, అసలు 'భగవంతుడు ఉన్నాడా?' అనే ఆ వ్యక్తి సందేహం నివృత్తి కావలసినదే." నేను వెంటనే ఆ వ్యక్తిని ప్రశ్నించాను 'మీరు గత కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. మీరు ఆఫీసుకి ఆలస్యంగా వెళ్ళినందుకు మీకు వచ్చే శాలరీ కట్ చేశారు కూడా! మీరు పాపం! ఆహార నిబంధనలని పాటిస్తున్నారు. బ్రెడ్, ఐస్‌క్రీం మాత్రమే తింటున్నారు. మీకు వైద్యం చేస్తున్న డాక్టరుగారు కూడా ఇక్కడనే ఉన్నారు కదా! మీరు గాని, మీ డాక్టరుగాని ఆ నొప్పిని నాకు చూపగల్గుతారా? మీరు చూపకపోతే మీకు నొప్పి ఉన్న విషయం నమ్మశక్యంకాదేమో! మీరు పొందే నొప్పి అనుభవ పూర్వకంగా తెలుసుకునేదే గాని, వేరొకరికి చూపలేరు కదా! అలాగే పరమాత్మని దర్శించిన జ్ఞాని అనుభూతిని పొందుతాడు. పరమాత్మని దర్శించాను అన్న వ్యక్తికి, దర్శించి అనుభూతిని పొందిన వ్యక్తికి తేడా ఉన్నది.

ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. 'రంగూన్ రౌడీ' నాటకంలో పాత్రధారి త్రాగినవాడివలె నటిస్తూ, క్రిందపడేటప్పుడు జాగ్రత్తగా పడతాడు. లేకపోతే కాలుగాని, చెయ్యిగాని విరగవచ్చు. కాని నిజంగా త్రాగినవాడి ప్రవర్తన ఎలా ఉంటుంది? వాడు క్రిందపడేటప్పుడు ఏమైనా తెలుస్తుందా? చీమ చూడండి! తాను పట్టుకున్న పటిక బెల్లాన్ని వదులుతుందా? తన ప్రాణాన్ని త్యాగం చేయటానికైనా వెనుదీయదు. అలాగే పరమాత్మ తత్త్వ విచారణలో మాధుర్యాన్ని గ్రోలే జ్ఞాని, ఆ జ్ఞానతీర్థాన్ని భక్తులందరికీ అందించటానికి సంసిద్ధుడౌతాడు. ఆ జ్ఞానతీర్థాన్ని గ్రోలి మననం చేసినవాడికి దానిలోని మాధుర్యం అందుతోంది. అంతేకాని ఒక చెవితో విని, రెండో చెవితో వదిలివేసేవాడికి దాని రుచి అందదు.

సూర్యకాంతి ప్రభావంచేత దర్శించలేక పగలు నక్షత్రాలు లేవు అంటారు. నక్షత్రాలు పగలూ ఉన్నాయి, రాత్రి ఉన్నాయి. పగలు సూర్యకాంతి అనే ఆవరణ దోషం చేత దర్శించలేకపోతున్నారు. మానవుడు అహంకారమనే ఆవరణని అధిగమిస్తే, పరమాత్మని దర్శించటం అసాధ్యం కాదు" అన్నారు శ్రీబాబు.

# విధి వ్రాత!

సేకరణ – సి.హెచ్. బాబ్జి

ఇంద్రుడి భార్య ఇంద్రాణి ఒక చిలుకను పెంచుతూ ఎంతో ప్రేమగా చూసుకునేది. ఒకరోజు ఆ చిలుకకు జబ్బు చేసింది. దిగులుపడి చిలుకను వైద్యునికి చూపించింది. ఆ వైద్యుడు ఇక చిలుక బ్రతకడం కష్టమని చెప్పాడు. ఆ మాట విన్న ఇంద్రాణి పరుగు పరుగున ఇంద్రుని వద్దకు వెళ్ళి"మీరేంచేస్తారో నాకు తెలియదు నా చిలుకను బ్రతికించండి. లేదంటే నేనూ చనిపోతాను" అని కన్నీరుపెట్టుకుంది. దానికి ఇంద్రుడు "దీనికే ఇంత ఏడవడం ఎందుకు!? అందరి తలరాతలు వ్రాసేది బ్రహ్మ కదా! నేను వెళ్ళి ప్రార్థిస్తాను. నువ్వేం దిగులు పడకు" అని బ్రహ్మ దగ్గరికి ఇంద్రుడు వెళ్ళాడు.

ఇంద్రుని ద్వారా విషయం తెలుసుకున్న బ్రహ్మ, "నేను తలరాతలు మాత్రమే వ్రాస్తాను. దాన్ని అమలు పరిచేది మహావిష్ణువు. కావున మనం విష్ణువు దగ్గరికి వెళదాం పద" అంటూ బయలుదేరారు. వీరి రాకను గమనించిన విష్ణువు వారిని ఆహ్వానించి విషయం తెలుసుకున్నారు. "నిజమే ప్రాణాలు కాపాడేవాణ్ణి నేనే! కానీ, చిలుక ప్రాణం చివరి దశలో ఉంది. మళ్ళీ ఊపిరి పోయాలంటే శివునికే సాధ్యం. మనం ముగ్గురం శివుని ప్రార్థిద్దాం పదండి" అన్నారు. ముగ్గురూ శివుని దగ్గరికి వెళ్లి విషయం చెప్పారు. శివుడు ఇలా అన్నారు. "ఆయుష్షు పోసేది నేనే కానీ ప్రాణం తీసే పని యమధర్మరాజుకు అప్పజెప్పాను. మనం వెళ్ళి యమధర్మరాజును అడుగుదాం పదండి" అంటూ అందరూ బయలుదేరారు.

ఇంద్ర, బ్రహ్మ, విష్ణువు, శివుడు అందరూ యమలోకానికి రావడం చూసిన యముడు వారిని సాదారంగా ఆహ్వానించి విషయం తెలుసుకున్నాడు. "అయ్యో! అదేమి పెద్ద పనికాదు. మాములుగా చావుకు దగ్గరగా ఉన్న వారి పేర్లను, వారు ఎలా చనిపోతారు అన్నది ఒక ఆకుమీద వ్రాసి ఒక గదిలో వ్రేలాడదీస్తాము. ఏ ఆకు రాలి క్రిందపడుతుందో వారు ఆయా సమయంలో చనిపోతారు. పదండి వెళ్ళి ఆ ఆకుని తొలగించి చిలుకను కాపాడుదాం!" అని అన్నాడు.

యముడు, అందరూ ఆ గదిలోకి వెళ్ళగానే ఒక ఆకు రాలి పడింది.ఆ ఆకు ఎవరిదో అని అందులో ఏమి రాసుందో చూద్దామని ఆ ఆకును తీసి చూడగా ఆ ఆకుపై చిలుక మరణానికి కారణం వ్రాసి ఉంది ఇలా.."ఎప్పుడైతే ఈ గదిలోకి ఇంద్రుడు, బ్రహ్మ, శివుడు, విష్ణువు, యమధర్మరాజు ఒకేసారి వస్తారో అప్పుడు చిలుక మరణిస్తుంది!" అని వ్రాసి ఉంది. ఇదే విధి! విధిని ఎవ్వరూ మార్చలేరు.

## వాచాజ్ఞానం

- పాలూరి కాళీప్రసాద్

"పుట్టిన ప్రతివారు మరణించక తప్పదు", "ఈ శరీరం అశాశ్వతమైనది. దీనితో వచ్చే బంధాలన్నీ కూడా అశాశ్వతమే", "ఇక్కడ ఎంత సంపాదించినా, ఎంత దాచుకున్నా పోయేటప్పుడు పూచికపుల్ల కూడా తీసుకుపోలేం" ఇలాంటి జ్ఞానం మనలో ప్రతి ఒక్కరికీ ఉంది. కాస్త ఊహ తెలిసిన చిన్నపిల్లలు కూడా ఇందులో కొంతవరకైనా చెబుతారు. అయితే ఇది కేవలం వాచాజ్ఞానంగానే మిగిలిపోతోంది తప్పితే అనుభవంలోకి, ఆచరణలోకి రావడంలేదు. ఈ జ్ఞానం మనకు ఎలా వస్తోంది? అంటే పుస్తకాలు చదవటంవల్లనో, ఆధ్యాత్మిక ప్రవచనాలు వినడంవల్లనో, లేదా మనకు బాగా కావలసిన వారు దూరమైన క్షణికావేశంలోనో వస్తోంది. అది పురాణ వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం, శ్మశాన వైరాగ్యం లాగా కొద్దిసేపే ఉంటోంది కానీ శాశ్వతంగా నిలవట్లేదు. కొంతమంది అదే పనిగా పుస్తకాలు చదవటమో, చర్చలలో పాల్గొనటమో చేసేవారు రోజూ ఇదే జ్ఞానాన్ని వల్లించవచ్చు. కానీ వారికి నిజంగా ఒక ఆపదో, కష్టమో వచ్చినప్పుడు ఈ వల్లించిన జ్ఞానం వారికి ఉపయోగపడుతోందా? వారి మనస్సును నియంత్రిస్తోందా? స్వాంతన కలిగిస్తోందా? అంటే సమాధానం చెప్పలేము.

పైకి ఎంత వేదాంతం వల్లించినా తన సంతానం స్థిరపడలేదనో, లేదా వారి బుద్ధి బాగోలేదనో, తనకు దక్కవలసిన ఆస్తి మరొకరికి పోయిందనో, లేదా తనకే ఏదో పెద్ద రోగం వచ్చినప్పుడో ఈ జ్ఞానం ఎంతవరకు నిలబడుతోంది? మనస్సు ఈ జ్ఞానానికి వ్యతిరేక దిశలో ఆలోచించకుండా ఉంటోందా? దీనికి కారణం ఏమిటి? ఆ జ్ఞానాన్ని కేవలం వల్లె వేయటమే తప్పితే ఆచరణలో చూపించలేకపోవటం, అభ్యాసం చేయకపోవటం, అనుభవంలోకి తెచ్చుకోకపోవటం. "కారు ఫలానా విధంగా నడపాలి. గేరు ఇలా వెయ్యాలి. స్టీరింగు ఇలా తిప్పాలి" ఇలా ఎన్నాళ్ళు పుస్తకంలో చదివినా, లేదా నలుగురితో చర్చించినా నీకు నిజంగా కారు నడపడం వస్తుందా? నీ మాటలు విన్న నలుగురూ "అమ్మో వీడికి కారు నడపడంలో ఎంత అనుభవం ఉందో" అని ఆశ్చర్యపోయి నిన్ను పొగడవచ్చు. కానీ నిజంగా కారు నడపవలసిన అవసరం పడినప్పుడు నువ్వు తెల్లమొహం వేస్తావు. ఇలాగే జీవితంలో ఏ విద్య అయినా కేవలం వల్లెవేయడం వలన అనుభవంలోకి రాదు

కదా! ఒక గురువును ఆశ్రయించి, ఆయన చెప్పిన మెలకువలను పాటించి చక్కగా అభ్యాసం చేస్తేనే వస్తుంది.

ఆధ్యాత్మిక విద్య కూడా అంతే. అయితే గురువును ఆశ్రయించి కొంతకాలం సత్సంగాలలో పాల్గొని నాలుగు మంచి ముక్కలు గుర్తు పెట్టుకోగానే మనకేదో చాలా జ్ఞానం వచ్చేసిందని అనుకుంటాం. చివరికి దానిని గురువుల ముందు ప్రదర్శించడానికి కూడా వెనుకాడం. చిన్నప్పటి నుండి ఆశ్రమంలో పెరిగి "జీవితంలో ప్రతి అడుగులో గురుదేవుల సూచనలు పాటించాలి. గురుదేవులు ఏది చెబితే అది తప్పనిసరిగా ఆచరించాలి" అని వింటూ ఉన్న యువకులు పదవ తరగతి అయిన తరువాత శ్రీ బాబూజీ మహరాజ్ వారి వద్దకు వెళ్ళి "ఇంజనీరు కావాలా, డాక్టరు కావాలా ఏమి చదవమంటార"ని అడిగేవారు. శ్రీగురుదేవులు వారిని "నువ్వు ఏమనుకుంటున్నావు? నీకు ఏదంటే ఇష్టం?" అని ప్రశ్నిస్తే వీరు ఇంతకు ముందు విన్న వాచాజ్ఞానంతో "మీరు ఏం చెయ్యమంటే అది చేస్తాను బాబూ!" అనేవారు. 'శ్రీ బాబూ విజ్ఞానమందిర్' మూడవ అంతస్తులో వాకింగ్ చేస్తున్న శ్రీ బాబూజీ "అయితే ఇక్కడినుండి క్రిందకు దూకు!" అనేవారు. ఈ యువకులు తెల్లమొహం వేసేవారు. అనుభవం లోనికి రాని వాచాజ్ఞానం, వాచావేదాంతం ఇలాగే ఉంటాయి.

మళ్ళీ మన కారు ఉదాహరణకే వస్తే డ్రైవింగ్ నేర్చుకొనే కొత్తల్లో భయం భయంగా ఉంటుంది. ఎప్పుడు ఎటు చూడాలి, ఎప్పుడు క్లచ్ నొక్కాలి, ఎలా గేర్ మార్చాలి, ఎప్పుడు బ్రేక్ వెయ్యాలి ఇలా దృష్టి అంతా దాని మీదే ఉంటుంది. ప్రక్కన ఎవరైనా మాట్లాడించినా, లేదా రోడ్డుమీద ఇతర ఆకర్షణలు ఎన్ని ఉన్నా వీడి దృష్టి అటు పోదు. అలా జాగ్రత్తగా, ఏకాగ్రతతో కొంతకాలం అభ్యాసం చేసిన తరువాత పైన చెప్పిన పనులన్నీ వాడికి సహజంగా అలవాటు అయిపోతాయి. నడవడం, మాట్లాడటం, గాలి పీల్చడం ఎంత సహజంగా చేస్తాడో, కారు నడపడంలో చేయవలసిన వివిధ పనులన్నీ అంతే సహజంగా చేసేస్తాడు. అప్పుడు ప్రక్కవాళ్ళతో ఎంత చర్చలు జరుపుతున్నా, రోడ్డుమీద వచ్చే పోయేవారిని, ప్రక్కనున్న ప్రకటనలను ఎన్ని చూస్తున్నా అతి సహజంగా చేతులు, కాళ్ళు తమ పని తాము చేసుకుపోతూ ఉంటే కారు ముందుకు సాగిపోతూ ఉంటుంది.

- సశేషం

# అవతార లక్ష్యం

- భాగవతుల హనుమత్ జయప్రద

భగవంతుడు ఎక్కడ ఉన్నాడురా? అని ఒక ఉపాధ్యాయుడు పిల్లలని అడిగారు. కొంతమందేమో "గుళ్ళో అండి" అన్నారు. కొంతమంది ఏమో మా ఇంట్లో ఉన్న పూజగదిలో అండి", కొంతమందేమో "మన అందరిలో ఉన్నాడండి" అని సమాధానం ఇచ్చారు. నిజానికి అన్ని సరైన సమాధానాలే అయినప్పటికీ, ఎవరెవారికి ఎంత తెలుసో, ఏ మానసిక స్థితిలో ఉన్నారో, వాటితో చెప్పిన సమాధానాలు ఇవి. అలాగే భగవంతుడిని చేరడానికి కర్మ, భక్తి, జ్ఞానాలు మూడు కూడా సరైన దారులే. మనలోని కర్మ, భక్తి, జ్ఞానాలనే ఎందుకు గీతాచార్యుడు ప్రభోదించారు? ఆయన నిర్గుణుడు కదా?

ఆయన నిర్గుణుడైనా, లోనున్నది సగుణ శక్తియే. అట్లా ఉండడం లేదా? మరి అవతార లక్ష్యం ఏమిటి? కర్మద్వారా, భక్తిద్వారా, జ్ఞానాన్ని పొందడమే అయితే అందరూ క్రియారహిత స్థితిని పొందగలరా? ఏ పని లేకుండా / చేయకుండా కూర్చోగలమా? కనీసం నిద్రలో అటువంటి స్థితిని పొందడం లేదా? ఏ పని చేయకుండా మనస్సు ఊరుకోదు కదా! **"నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠతి అకర్మకృత్"** (భగవద్గీత 3-5) అంతేకాదు, మనస్సులో ఆలోచనే రాకూడదంటుంది అద్వైతం. అందరూ కర్మ, భక్తి మార్గాలను అనుసరించగలరు. మరి జ్ఞానమార్గం అందరికి సాధ్యమేనా? భక్తిలో పండితే వైరాగ్యం వస్తుంది. అది పట్టుబడకపోయినా ఈశ్వరుని పట్ల అమిత ప్రేమను చూపించగలడు. యజ్ఞ, యాగాది, వైదిక కర్మలు చేయలేకపోయినా పూజ, ఆలయదర్శనం, తీర్థయాత్రలైనా చాలు.

మరి సద్గురువులుగా ఎందుకు అవతరించాలి?

ప్రజలను (భక్తులను) దారి మళ్లించడం కోసం అవతరించాలి. వైదిక కర్మలను చేయడానికి ప్రోత్సహించాలి. తద్వారా చిత్తశుద్ధి కలుగుతుందని చెప్పాలి. ఆలయాలలో యంత్ర ప్రతిష్టలు చేయాలి. ప్రజలను(బిడ్డలని) భక్తిమార్గంలో పెట్టడానికి అవతారం ఏర్పడింది. అంతేకాదు, క్రియారహిత స్థితియే పరమ లక్ష్యమని ప్రజలకు బోధించాలి. అప్పుడు జ్ఞాన మార్గానికి మళ్ళుతారు. దీనిని చాలామంది అనుసరించ లేకపోవచ్చు. పరిపక్వత లేకపోతే అలాంటి మార్గంలో అడుగు పెట్టవద్దని ఈశ్వర సంకల్పం కాబోలు. అందుకే ప్రవృత్తి మార్గాన్ని ముందు బోధించి,

అందులో వారు నిలద్రొక్కుకున్న తరువాత నివృత్తి మార్గాన్ని బోధించాలని అవతార సంకల్పం కావచ్చు.

శ్రీ బాబూజీ మహారాజ్ వారి భోధామృతంలో "వట్టి గింజ, గట్టి గింజ" గురించి ఎన్నోసార్లు ప్రబోధించారు. దాని అర్థం తమ బిడ్డలము అయిన మన అందరమూ గట్టి గింజలుగా ఆయన పాదాల చెంతనే అంటిపెట్టుకుని ఉండాలి అని. కర్మ, భక్తి మార్గాలను ఎవరు ఎంతవరకు ఆచరించినా, చివరికి గురుసాయుజ్యము పొందడానికి కావాల్సినది గురుదేవుల కృపతో పొందగలిగే జ్ఞానం. పరిపూర్ణమైన జ్ఞానంతో వచ్చే అనుభవం తరువాత ఇంకా వేరే కర్మలతో పని ఏముంది? ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది, ఆత్మనందానుభవం కావాలనే కోరిక పుట్టాలంటారు, ఆ కోరిక కూడా పోతేనే అనుభవం కలుగుతుందంటారు. ఇదేమి పరిస్థితి! శివదర్శనం కోసం అన్నింటినీ వదిలి, చివరికి శివ దర్శనం కావాలన్న కోరిక కూడా వదిలితేనే అప్పుడు మనకు శివదర్శనం అవుతుంది. అర్ధనారీశ్వరిగా సదా శివుడితో ఉన్న ఉమామహేశ్వరికి శివుడ్ని చూడాలన్న కోరిక కలిగి తపస్సు చేసింది. ఒక తేజస్సు కనిపించింది. అది నా దృష్టి మేరలోనిదే కదా! అనుకొని తపస్సు కొనసాగించి చివరికి తన స్థితియే శివుడని తెలుసుకుంది. "నువ్వు చూడటమే కాదు, నువ్వు ఉండటం కూడా శివసాన్నిధ్యమే".

మన జన్మకి గల లక్ష్యం ఏమిటి? వాసనారహితులము అవ్వడమే మన జన్మకు గల లక్ష్యం. శ్రీ బాబు బోధించినట్టు "వాసనా రహితుడవు అయితేగాని వాసుదేవుని దర్శనం లభించదు." మనం గుణ రహితులం కావాలంటే అసలు మనను ఆక్రమించుకున్న గుణాలేమిటో తెలియాలి. గుణాలు ఎలా తెలుస్తాయంటే, మన ప్రవర్తన ద్వారానే....ఒక చంటి పిల్లవాడిని దుకాణానికి తీసుకెళితే వాడికి ఇష్టమైన వస్తువు వైపు చేయి లేస్తుంది. ఆ కదలికే అతడి గుణాన్ని తెలియజేస్తుంది. మరో కొలమానం అవసరం లేదు. మనం కూడా దుకాణానికి వెళ్ళి వంద డిజైన్లు చూసి నచ్చటం లేదంటే మనకి ఇష్టమైనదేదో మరో డిజైన్ ఉందనే అర్థం. మనకు నచ్చటం మొదలైందంటేనే కోరిక మొదలైందని అర్థం. ఒక వస్తువు గుణం ఏమిటంటే అది మనకు కావాలనిపించటమే. ఆ గుణమే మనని మనినిగా ఉండనివ్వటం లేదు. ఇదంతా మనను గమనించుకుంటే అర్థమవుతుంది. దీన్నే శ్రీ గురుదేవులు విచారణమార్గం అని చెప్పారు. *

# జ్ఞాన నేత్రం

- మల్లిప్రియ

శ్రీహనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ కలియుగ మహాత్మ్యాన్ని గురించి జ్ఞాననేత్రం తెరుపవలసిన అవసరాన్ని గురించి ఒకానొక సత్సంగ సమావేశంలో యిలా వివరించారు.

కలియుగంలో మానవుడు సందేహ ప్రాణియైనాడు. భగవంతుడు సాకారుడు అని చెప్పినా, నిరాకారుడు అని చెప్పినా నాస్తికుడు నమ్మడు. భగవంతుడు సాకారుడని శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడిగా జన్మించాడని శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీశంకరాచార్యుల వంటి మహనీయులు భగవంతుని అంశతో జన్మించారని చెబితే నాస్తికుడు యిలా అంటాడు 'అతనికీ మనలాగే రెండు చేతులూ రెండు కాళ్ళూ ఉన్నాయి. మనలాగే తింటున్నాడు. నిద్రిస్తున్నాడు కదా!' ఇక దేవుడు నిరాకారుడని చెబితే 'కనిపించని దేవుడిని ఎలా నమ్మటం?' అంటాడు నాస్తికుడు. ఇదంతా కలియుగ ప్రభావం. అయితే వీటికి సమాధానాలు ఉన్నాయి. ఇక 'దేవుడు ఎక్కడ ఉన్నాడు?' అని అడిగితే, 'దేవుడు ఎక్కడ లేడో ముందు చెప్పండి' అన్నాడు వివేకానందుడు. ప్రహ్లాదుడికి స్తంభంలో కూడా కనిపించాడు కదా!

ప్రక్కనే గల రెండిళ్ళల్లో రేడియోలు ఉన్నాయి. ఒక యింటిలో రేడియో పెడితే పాటలు వినవస్తున్నాయి. ఒక యింటిలో రేడియో పెట్టలేదు. అంతమాత్రం చేత రేడియోలో పాటలు రావటం లేదని చెప్పటం తప్పుకదా! అలాగే అజ్ఞానం చేత మనకు కనిపించనంతమాత్రాన దేవుడు లేడు అనటం అవివేకం కదా!

'మరి ఉంటే దేవుడు ఎందుకు కనిపించడు?' ఆలోచించండి. రేడియోని జాగ్రత్తగా త్రిప్పాలి. పాయింట్ సరిగా ఉంటేనే విజయవాడ వస్తుంది. మరొక చోటుకి త్రిప్పితే మరేవో పాటలు వినిపిస్తాయి. అలాగే ప్రహ్లాదుడు, ధృవుడు మొ॥గు వారి మార్గాన్ని అనుసరించండి. రేడియోని సరిగా త్రిప్పండి. తప్పక భగవంతుడు మీకు యీ జన్మలోనే సాక్షాత్కరిస్తాడు.

భార్యాపిల్లలను వదిలివేసి, అందరూ సన్న్యసించవలసిన పనిలేదు. మన పనులన్నీ మనం చేసుకుంటూనే దృష్టి మాత్రం భగవంతునిపై ఉంచాలి. ఇది సాధ్యమా? ఎందుకు సాధ్యం కాదు?

# గాయత్రి మంత్రం

(గత సంచిక తరువాయి) సేకరణ - కె. రాఘవరాజు

'ఔ దొరా! మాదేశం మహా గొప్పది!' మురిసిపోతూ తన దేశాన్ని గురించి చెప్పుకున్నాడు మరో జవాన్ రొప్పుతూ వెంట నడుస్తూ. 'శంకరాచార్యుల వారు మఠాన్ని ఇక్కడే ఎందుకు స్థాపించాలనుకున్నారో తెలుసా?' థామస్ అడిగాడు.

'శంకరాచార్యుల వారు, తమ పరివార శిష్యులతో ధర్మ ప్రచారం కోసం దేశాటన జరుపుతూ ఇక్కడ పర్యటిస్తున్నప్పుడు, ఆయన ఒక చిత్రం చూశారు దొరా! ఒక సర్పం ప్రసవిస్తున్న ఒక కప్పకు ఎండ పడకుండా తన పడగ నీడ పడుతున్న దృశ్యం ఆయన చూసి ఆశ్చర్యపడి, ఈ స్థల మహత్యం గొప్పదని గమనించారు. అంతే కాక ఇక్కడ వరకు వచ్చేసరికి మండనమిశ్రుడి భార్య అయిన ఉభయభారతి సరస్వతి మూర్తిగా మారి పోతుంది. ఆ కథ చాలా పెద్దది, ఇంకోమారు చెప్తాను దొరా! ఈ రెండు సంఘటనలు చూసిన ఆయన ఇక్కడే మెదటి మఠం నిర్మించాలని తలచి మఠాన్ని స్థాపిస్తారు. ఆదిశంకరుడు ఇక్కడ 12 సంవత్సరాలు గడిపారని చెప్తారు. అంత గొప్ప పుణ్యక్షేత్రం ఈ శృంగేరి.'

'మరి ఆ మహాపురుషుడేనా ఈయన?' అడిగాడు దొర. 'కాదు దొరా! అది జరిగి చాలా ఏళ్ళైంది. ఈయన ఆ గురు పరంపరలోనివారే! వీరంతా బాల్యంలోనే పీఠాన్ని చేరి వేద వేదాంగాలూ, శంకరాచార్యుల వారు ప్రవచించిన విశేషాలన్నీ అధ్యయనం చేస్తారు దొరా! వీరంతా బ్రహ్మచారులు, ఎవ్వరూ వారిని ముట్టుకోడం కాదు గదా! దరిదాపులకు వెళ్ళడానికే జడుస్తారు. స్త్రీలైతే బహు దూరం నుంచీ దర్శించవలసినదే! వారి అనుగ్రహ భాషణంలోని ఆధ్యాత్మిక విషయాలు చాలా గొప్పవి దొరా! ఒక్కటి ఆచరిస్తే చాలు జన్మ సార్ధకమవుతుంది' చెప్పాడు జవాను.

దూరంనుంచి ఆ ఆచార్యులను గమనించిన థామస్ 'ఆహా! ఆ ముఖ వర్చస్సెంత గొప్పగా ఉంది! వెయ్యి వాల్టుల బల్బు వెలుగుతున్నట్లు వుంది వారి తేజస్సు! మరి బాపన్నా! ఆచార్యుల చెంతగా ఉన్న ఆ స్త్రీమూర్తి ఎవరు? స్త్రీలకు ప్రవేశమే లేదన్నట్లు చెప్పావు? మరి వారికి అంత దగ్గరగా ఉన్న ఆ అందమైన, అద్భుతమూర్తి, టీనేజ్‌గాళ్! ఎవరు బాపన్నా! వెళ్ళి తెల్సుకుని వస్తావా? ఈజ్ షీ హిజ్ సిస్టర్?' అన్నాడు దొర. 'దొరా! మాకక్కడ

ఎవ్వరూ స్త్రీమూర్తి కనిపించడం లేదే! మీకెవరు కనిపిస్తున్నారు?' 'అదిగో బాపన్నా! అంత బాగా కనిపిస్తుంటే లేదంటావేం? వెళ్ళి అడిగిరా పో?' అన్నాడు థామస్ దొర. దొర ఆదేశం మేరకు బాపన్న చేతులు కట్టుకుని దగ్గరగా వెళ్ళి వినయంగా, ఆచార్య శిష్యులకు తమ దొర సందేహం విన్నవించాడు.

ఆ శిష్యుడు ఆశ్చర్యంగా 'అక్కడ మాకెవ్వరూ స్త్రీమూర్తి కనిపించడం లేదే! అసలిక్కడ స్త్రీలకు ప్రవేశమేలేదే?' అన్నాడు. బాపన్న 'ఔ స్వామీ! మాకూ కనిపించడంలేదు. కానీ మా దొరకు కనిపిస్తున్నదిట! అడిగి వివరం తెల్సుకు రమ్మన్నారు. పీఠాధిపతులకు విన్నవించండి' అన్నాడు. ఆ శిష్యుడు పీఠాధిపతులను సమీపించి, ఆ దొరగారి సందేహాన్ని చెప్పగానే, ఆశ్చర్యంగా ఆయన తలెత్తి దూరంగా గుఱ్ఱం దిగి తననే దీక్షగా చూస్తున్న ఆ దొరను చూసి, 'నాయనా! నా సమీపంలో ఉన్నది శారదా మాత! ఆ తల్లి దర్శనం ఎవరికో నిష్టగా గాయత్రి చేసే వారికి కానీ లభించదు. నేను ఇక్కడ ప్రవచిస్తున్నంత సేపూ ఆ మాత నా సమీపంలో ఉండి సద్వాక్కులను నా నోట పలికిస్తూ వుంటుంది. నాశిష్యులైన మీరే కాంచలేని 'అమ్మ'ను ఆ దొర దర్శించాడంటే ఆయన పూర్వజన్మలో భారతదేశంలో జన్మించి, గాయత్రీ జపం సంపూర్ణంగా, నిష్టగా గావించి ఏదో ఒక కారణాంతరం వల్ల ఆంగ్లేయుడై, ఆ పాశ్చాత్య దేశంలో జన్మించాడు. నేను పీఠాధిపతిని కనుక ఆయనకు నమస్కరించరాదు. లేనిచో ఆయన నమస్కార అర్హుడని వెళ్ళి చెప్పిరా!' అని శృంగేరీ పీఠాధిపతి చెప్పి పంపారు.

'అదిరా గాయత్రీ మంత్ర మహత్యం. అర్థమైందనుకుంటా! నియమంగా భక్తితో జపించిన వారికి ఈ జన్మలోనే కాక మరుజన్మ లోనూ రక్షణనందిస్తుంది' అని తాతగారు వివరంగా చెప్పారు.

పిల్లలిద్దరూ 'మన్నించండి తాతగారూ! మాకివన్నీ తెలీక తేలిగ్గా మాట్లాడాము. మాకు ఆ గాయత్రి ఉపదేశించండి.. ఈ వేసవిలో ఇక్కడ ఉన్నన్నాళ్ళూ మీతో పాటు రోజూ గాయత్రి చేస్తాము. మా ఊరువెళ్ళాక వీలున్నంత సేపు నిత్య గాయత్రి చేసేందుకు ప్రయత్నిస్తాము' అన్నారు.

# గురు కృపాహి కేవలమ్

- రమణ ప్రసాద్

శ్రీగురుదేవులు 1966 మేలో సంపూర్ణ ఉత్తరదేశ యాత్ర భక్తులందరితో కలసి చేయాలని సంకల్పించారు. చంద్ర (శ్రీమాతాజీ) తాను కూడా వస్తాననే కోరికను వ్యక్తం చేసింది. శ్రీబాబు అంగీకరించారు. అందుకోసం రాఘవమ్మగారిని (చంద్ర తల్లిని), అమ్మన్నగారిని (నాయనమ్మ) కూడా బయల్దేరమని చెప్పారు.

శ్రీబాబు భక్తులందరితో కలసి హృషీకేశ్ చేరారు. అందరూ ప్లాట్‌ఫారం మీద భోజనాలు చేస్తూండగా, బాగా గడ్డం పెరిగి, వికృతాకారంగా ఉన్న ఒక వ్యక్తిని చూసి చంద్ర 'బాబూ!' అని పెద్ద కేకపెట్టి మూర్ఛపోయింది. యాత్రలో వస్తున్న నింద్రకొలను డాక్టరుగారు చంద్రను పరీక్ష చేశారు. ఇంజక్షను యిద్దామని ప్రయత్నిస్తే ఎక్కలేదు. డాక్టరుగారు శ్రీబాబుతో "పరిస్థితి చేయి దాటిపోయింది. ఆశ ఏమీలేదు. ఇక గురుకృప మాత్రమే శరణ్యము" అని చెప్పి తన బోగీలోకి వెళ్ళిపోయారు.

శ్రీబాబు చంద్ర తలపై తన చేయి ఉంచి యోగసమాధి నిష్ఠులైనారు. ఒక గంట గడిచిన తరువాత అచేతనంగా ఉన్న చంద్రలో కొంచెం కదలిక వచ్చింది. కళ్ళు తెరచి చూసి 'బాబూ!' అంటూ చేతులు చాపింది. శ్రీబాబు చంద్రను చేతులలోకి తీసుకుని వెన్ను తడుతూ, రాఘవమ్మగారిని పిలిచారు. ఆమె రాగానే చంద్రను ఆమె చేతిలో పెట్టి, "అమ్మా! ఇదిగో! నీ బిడ్డను సురక్షితంగా నీ చేతిలో పెడుతున్నాను. డాక్టరుగారు 'ఏమీ ఆశ లేదు అంతా అయిపోయింది అనేసరికి' 'నా ఒక్కగానొక్క బిడ్డను నాకు కాకుండా చేస్తారా?' అని నింద వేస్తావేమో అని నా గుండె టకాటకా కొట్టుకుంది. కాని కరుణామూర్తి అయిన జగన్మాత ఆ నింద రాకుండా నీ బిడ్డను పునర్జీవితురాలిని చేసింది" అన్నారు.

రాఘవమ్మగారు ఆనందబాష్పాలతో శ్రీగురుచరణాలను అభిషేకిస్తూ 'ఆ జగన్మాత ఎవరో మాకు తెలియదు కాని, మాకు మీరే అన్నీ. గురుదేవులు, బంధువు, మిత్రులు, సర్వస్వమూ తమరే. ***అన్యథా శరణం నాస్తి త్వమేవ సర్వం మమ***' అన్నారు. "తథాస్తు" అన్నారు శ్రీబాబు.

శ్రీమాతాజీ కృతజ్ఞతా భావంతో ఎన్నోసార్లు యీ సంఘటనను గూర్చి తమ అభిభాషణలలో యిలా చెబుతూ ఉంటారు. "అప్పుడు నా ఒళ్ళు

చల్లబడిపోయింది. శ్రీబాబు నన్ను ఒళ్ళో పడుకోబెట్టుకుని తమ చేతిని నా తలపై ఉంచి ధ్యానముద్రలోకి వెళ్ళిపోయారు. కొంతసేపటికి నాకు స్పృహ వచ్చి 'బాబూ!' అంటూ ఆయన చేతులలో వాలిపోయాను. నన్ను చూసి 'ఏమీ ఆశ లేదు' అని డాక్టరుగారు చెప్పారు. మరి నన్ను రక్షించింది ఎవరు? శ్రీగురుదేవులే నన్ను రక్షించారు. గురుకృప నన్ను రక్షించింది.

ఉత్తరదేశ యాత్రలో కాశీ క్షేత్రంలోనూ, బదరీలోనూ శ్రీబాబు తమ దివ్య దర్శనాన్ని చంద్రకు ప్రసాదించారు. శ్రీబాబు అఖండ తేజో మూర్తిగా యోగసమాధి నిష్ఠులై కనిపించారు. చంద్ర తాను కూడా కనులు మూసుకుని ధ్యాన నిమగ్నురాలైంది. తాను కూడా అఖండ తేజోరాశిగా ప్రకాశిస్తున్నట్లుగా అనుభూతి కలిగి, ఆ అనుభూతిలో మైమరచిపోయి ఉండిపోయింది.

శ్రీబాబు చంద్రను "ఎలా ఉంది?" అని ప్రశ్నించారు. 'చెప్పలేనంత ఆనందంగా ఉంది బాబూ' అని చెప్పింది. శ్రీబాబు "నీ స్వస్వరూపమూ, స్వానుభవమూ నీకు రుచి చూపించాను. ముందు ముందు ఎన్నెన్నో దివ్యానుభవాలు నీకు కలుగుతాయి" అని ఆశీర్వదించారు.

శ్రీమాతాజీ రూపంలో శ్రీగురుదేవులే మూర్తీభవించి ఉన్నారు అని అశేషభక్త జనావాళి అనుభవపూర్వకంగా శ్రీబాబూజీని శ్రీమాతాజీలో దర్శించుకుంటున్నారు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***నవంబర్ 2023 :*** AS 4324, 7450, 7926, 7932 - 7934, 7936 - 7941, 7943, 7944, 7951, 7956, 8485, 9176; LM 4393

***డిశెంబర్ 2023 :*** AS 2781, 7159, 7416, 7957 - 7959, 8327, 8836, 9148 - 9151, 9153 - 9156, 9160, 9163 - 9166, 9168 - 9175, 9181 - 9186, 9188, 9189, 9191 - 9194 ; LM 4397, 4398

# పుట్టినిల్లు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

చేపకు పుట్టినిల్లు నీరు. ఆ నీటియందే దానికి ఆనందము. ఆ నీటి యందే దానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, నిర్భయత్వము. దానిని అచటి నుంచి బయటకు తీసుకు వచ్చి, చక్కటి పాన్పుపై పరుండబెట్టి, వింజామరలు వీచుచు, సమస్త రాజోపచార, దేవోపచారములు చేసినను దానికి తృప్తి యుండదు. ఆనందము కలుగదు. స్వస్థానమగు నీటినే అది అహర్నిశలు వాంఛించుచుండును. దాని యందే పరమ శాంతి బడయుచుండును.

అట్లే జీవుని పుట్టిల్లు పరమాత్మ. అట్టి పరమాత్మను జేరు వరకు అతడు విశ్రమించరాదు. ప్రతిక్షణము ఆ మహోన్నత లక్ష్యము కొరకే తీవ్రతర ప్రయత్నము సలుపుచుండవలెను. విషయ భోగాదులయందు ఆసక్తిని బొందరాదు. అవి యెంత రమణీయముగను, ఆకర్షణీయము గను వున్నప్పటికినీ ఆత్మసుఖమునకు తీసికట్టేయగును. ప్రతిబింబ సుఖము ఎంత గొప్పదైనప్పటికి బింబసుఖమునకు సాటి కాజాలదు.

**నీతి - ప్రతి మానవుడును తన పుట్టిల్లగు ఆత్మను చేరుటకై వివేక వైరాగ్యాలను చక్కగ అభ్యసించి, ఆత్మేతర వస్తువుల యెడల విరాగము కలిగి ఉండవలెను.**




దేహభ్రాంతి
ముకుంద్
నేను వచ్చే జన్మలో పందిగా పుడతానని, ఆ తరువాత మళ్ళీ మానవ జన్మ వస్తుందని నా దివ్య శక్తులు చెబుతున్నవి సుమా!
నేను ఇంకొన్ని రోజుల్లో ఈ దేహాన్ని వదిలేసి వెళ్లిపోతున్నాను. నేను నా దేహాన్ని విడిచి వెళ్ళిన మూడు రోజులకి ఈ ఇంటికి దగ్గర ఉన్న కాలువలో ఒక పందిలా పుడతాను. ఆ జుగుప్సాకరమైన దేహం నాకు వద్దు. అందుకే నేను పుట్టిన క్షణమే నువ్వు నన్ను కత్తితో చంపు. అప్పుడు నాకు మళ్ళీ మానవ జన్మ లభిస్తుంది.


కానీ మిమ్మల్ని ఎలా గుర్తించాలి, నాన్నగారు?
అక్కడ ఉన్న ఐదు పిల్లల్లో కేవలం ఒక పిల్లకి మాత్రమే విష్ణు నామాలు ఉంటాయి. ఆ పిల్లనే నేను.


అది చెప్పిన రెండు వారాలకి......


మూడు రోజుల తరువాత......
నాన్నగారు విష్ణు నామాలు ఉన్న పంది అన్నారు కదా! అదిగో పంది!


ఆగు నాయనా!


ఎందుకు నాన్నగారూ?
నాకు ఈ జన్మ చాలా బాగుంది. ఇక్కడ బురదలో దొర్లితుంటే, ఈ తల్లి పాలు త్రాగుతుంటే ఎంత సుఖంగా ఉంది.


చూశారా ఎన్ని జన్మలెత్తినా దేహభ్రాంతి ఎలా వెంటాడుతుందో! మానవుడు భవిష్య దేహం గురించి ఎంత జుగుప్సాకరమనుకున్నా, అక్కడ దాకా చేరేసరికి ఆ దేహం, లేదా స్థితిని అంత ఇష్ట పడతాడు. అదే దేహభ్రాంతి.

# మత్స్యేంద్రనాథ్

సేకరణ - మురళీ

సర్వోన్నతుడైన బ్రహ్మ భూమిపై నైతిక విలువలను వ్యాప్తి చేయాలని నిర్ణయించారు. బ్రహ్మ యొక్క వీర్యం భూమిపై వివిధ సాధువులు మరియు ప్రవక్తల పుట్టుకకు కారణమని పురాణం చెబుతుంది. కలియుగం ప్రారంభంలో భూమి యొక్క వివిధ ప్రాంతాలలో బ్రహ్మ యొక్క వీర్యం పడింది. చేప నోట్లో వీర్యం పడి గర్భవతి అయింది. సముద్ర జలాలలో శంకర భగవానుడు పార్వతీమాతకు సృష్టి సూత్రాలను బోధిస్తున్న ఏకాంత ప్రదేశానికి గర్భం ధరించిన చేప చేరుకుంది. పార్వతి శంకరుడిని "సమస్త మాయ సృష్టికి ఆధారం ఏమిటి?" అని అడిగినప్పుడు, చేప గర్భం నుండి "బ్రహ్మ తత్త్వం" లేదా "దేవుని అంశ" అని సమాధానం వచ్చింది.

సరైన సమాధానంతో ఆశ్చర్యపోయిన శంకర భగవానుడు నీటిలోకి చూశాడు, అతనికి చేప గర్భం లోపల ఒక శిశువు కనిపించింది. అతను వెంటనే బిడ్డను "కవి నారాయణ్" అని గుర్తించాడు, ఇది విష్ణువు యొక్క కవితా అవతారం. అప్పుడు అతను ఆ బిడ్డను ఆశీర్వదించాడు మరియు 12 సంవత్సరాల వయస్సులో అతనికి బోధిస్తానని చెప్పాడు.

కాలక్రమేణా ఆ చేప మహారాష్ట్ర తీరంలో జాలరి దంపతులకు దొరికింది. వారు దానిని గట్టుకు చేర్చగానే పెద్దగా ఏడుస్తూ చేప గర్భం లోనుంచి పాప బయటకు వచ్చింది. ఈ అద్భుతాన్ని చూసి ఆశ్చర్యపోయి పిల్లలు లేని జాలరి దంపతులు కరుణతో పిల్లవాడిని ఇంటికి తీసుకెళ్ళారు. మత్స్య (చేప) గర్భం నుంచి జన్మించాడు కాబట్టి మత్స్యేంద్రనాథ్ (అంటే చేపలకు ప్రభువు) అని పేరు పెట్టారు. ఒకసారి తండ్రి పట్టుకున్న చేపలను తిరిగి నీటిలోకి వదిలివేసి తండ్రికి ఆశ్చర్యాన్ని కలిగించాడు. జీవనోపాధి లేకపోతే యాచించి బ్రతక వచ్చునని తండ్రికి చెప్పాడు. పరిణతి చెందిన వ్యక్తిలా చేపలను చంపే పాపభరితమైన జీవితాన్ని గడపడం కంటే యాచించి పాపం లేని ఆహారం తినడం మంచిదని సూచించాడు. తర్వాత మత్స్యేంద్రనాథ్ ఇంటి నుండి వెళ్ళిపోయి బద్రీనాథ్ చేరుకున్నాడు. అక్కడ 12 సంవత్సరాలు పండ్లు మరియు నీరు మాత్రమే సేవిస్తూ తపస్సు చేశాడు. దత్తాత్రేయులవారు, శివుడు దర్శనం యిచ్చి ఉపదేశం చేశారు. కలియుగంలో వ్యాపించిన చెడు నుండి ప్రజలను రక్షించటానికి అవసరమైన మార్గాలను సూచించి తగిన శక్తిని ప్రసాదించారు. మత్స్యేంద్రనాథ్‌కి భూత భవిష్యత్ వర్తమానాలను గ్రహించగలిగే శక్తిని ప్రసాదించారు.

మత్స్యేంద్రనాథుని శిష్యుడు గోరఖ్‌నాథ్ నేపాల్‌లోని పటాన్‌ను సందర్శించినప్పుడు, స్థానికులు అతనికి భిక్ష ఇవ్వనందున కోపించి, అతను పటాన్‌లోని వర్షాలను కురిపించే సర్పాలన్నింటినీ బంధించి, ధ్యానం చేయడం ప్రారంభించాడు. దీంతో పటాన్ చాలా కాలంగా కరువును చవిచూడాల్సి వచ్చింది. తన సలహాదారుల సలహా మేరకు, పటాన్ రాజు గోరక్షనాథుని గురువు మత్స్యేంద్రనాథ్‌ను పటాన్‌కు ఆహ్వానించాడు. గోరక్షనాథుడు తన గురువు పటాన్‌లో ఉన్నారని తెలుసుకుని, సర్పాలను విడిచిపెట్టి, గురుదర్శనానికి వెళ్ళాడు. సర్పాలకు విముక్తి కల్గిన వెంటనే భారీ వర్షాలు కురిశాయి. అప్పటినుంచి పటాన్ వాసులు మత్స్యేంద్రనాథ్‌ను వర్షపు దేవుడిగా పూజించసాగారు. ప్రతి సంవత్సరం, లలిత్‌పూర్‌లోని పటాన్‌లోని స్థానికులు వానదేవుని గౌరవార్థం పండుగను ఏప్రిల్-మే మాసాలలో జరుపుకుంటారు. ఈ పండుగ పటాన్‌లో జరుపుకునే పురాతన మరియు దీర్ఘకాలంనుండి వస్తున్నది. ఇది వర్షాకాలం ప్రారంభానికి ముందు జరుపుకుంటారు, తద్వారా నగరం మంచి పంటల పెరుగుదలకు తగినంత వర్షపాతం పొందుతుంది.

మత్స్యేంద్రనాథులు ఎనభై నాలుగుమంది మహాసిద్ధులలో ఒకరు. ప్రారంభ హఠయోగా యొక్క ప్రముఖ వ్యక్తి. హిందువులు ఆయనను శివుని అవతారంగా, బౌద్ధులు ఆయనను అవలోకితేశ్వరుని అవతారంగా భావించి పూజిస్తారు. మత్స్యేంద్రనాథుని శిష్యులు గోరఖ్‌నాథ్, జలంధర్నాథ్, కాన్హోబా, గహినీనాథ్, భర్తినాథ్, రేవన్నాథ్, చర్పతీనాథ్ మరియు నాగనాథ్. మత్స్యేంద్రనాథ్‌తో కలిపి వారిని నవనాథులు అంటారు. గోరఖ్‌నాథ్ (గోరక్షనాథ్) మత్స్యేంద్రనాథ్ యొక్క ప్రత్యక్ష శిష్యుడిగా పరిగణింపబడ్డాడు.

శిష్యుడు ఎలాఉండాలి అని గోరక్షనాథులు అడిగిన ప్రశ్నకు మత్స్యేంద్రనాథుల సమాధానం: “ఒక అవధూతగా ఏదైనా ఆశ్రమంలో నివశిస్తున్నా, రహదారి ప్రక్కన చెట్ల నీడలో విశ్రాంతి తీసుకుంటున్నా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను త్యజించాలి. తనలోకి తాను చూసుకుంటు అనంతబ్రహ్మం గురించి ఆలోచించాలి. మిత ఆహారం, మిత నిద్రతో జీవించాలి. వాస్తవికతను గుర్తించాలి. గురువాజ్ఞతో శిరోముండనం చేయించుకోవాలి. నిజమైన జ్ఞాన సముపార్జన ఆనకట్ట వంటిది. గురువు యొక్క సాక్షాత్కారం అమరత్వాన్ని యిస్తుంది. మనకు సాక్షాత్కారం కలిగినప్పుడు ప్రపంచంతో అనుబంధం నిలిచిపోతుంది”.

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భగవద్గీతలో గీతాచార్యులు **మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా యివ** అని శలవిస్తూ ఈ జగత్తుకంతా తానే సూత్రమునని తెలియజేశారు. మరి ఆ సూత్రధారిని చేరుకునే గమ్యం సూచించే భక్తి సూత్రములు సాధకులైన మనందరికీ నిత్యమంత్రములే కదా! ఈ సూత్రములే భక్తిని అంచెలంచెలుగా పెంపొందించుకోవడానికి ఔషధ గుళికలవలె పనిచేసి, సాధకుల ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదపడతాయనడంలో సందేహం లేదు.



**నారదులు - గురుస్వరూపము**

'నారం' అంటే జ్ఞానమని అర్థం. **నారం దదాతి ఇతి నారదః** అన్న నిర్వచనం ప్రకారం జ్ఞానమును బోధించే గురు స్వరూపముగా నారదులవారు అనేక పురాణేతిహాసములలో దర్శనమిస్తారు. 'నారం' అన్న శబ్దమునకు జీవ భావన అన్న మరొక అర్థం కూడా వున్నది. **నారం ద్యతీతి నారదః** అంటూ జీవభావనను ఖండించి, నశింపజేసే గురుస్వరూపమే నారదమహర్షి. వాల్మీకికి రామతారక మంత్రమును బోధించి, ఆయనను మహర్షిని చేసి, ఆదికావ్యమైన రామాయణము నకు కారణభూతులయిన వారు నారదులే! వేదవ్యాసుల వారిని ప్రేరేపించి తాను బ్రహ్మద్వారా విన్న భాగవతమును ఆయనకు వినిపించి, ఆయన ద్వారా 18 వేల శ్లోకములు గల శ్రీమద్భాగవత రచనకు మూల కారణమూ నారదులే! ధృవునకు మార్గోపదేశము చేసినదీ, గర్భములో వున్న ప్రహ్లాదునకు గురువై మంత్రోపదేశము చేసినదీ నారదులవారే!

ప్రతి పురాణములోనూ రాక్షస సంహారములోను, భాగవత ధర్మ ప్రచారములోను నారదమహర్షి యొక్క పాత్ర దర్శనమిస్తుంది. బ్రహ్మ మానస పుత్రుడయిన నారదుడు స్వయాన నారాయణుని అవతారమే అని చెప్పబడింది. కలియుగ ప్రారంభంలో భక్తిని నలుదిశలా వ్యాప్తి

చేస్తానని కంకణం కట్టుకున్నదీ నారద మహర్షియే! భాగవత ధర్మమును మొత్తం క్రోడీకరించి 84 సూత్రముల ద్వారా అందించారు. శ్రీమద్భాగవతములోని 18వేల శ్లోకముల సారమును ఈ సూత్రములలో నిక్షిప్తం చేశారు. నారదుని జన్మ వృత్తాంతములో మహాత్ముల సేవనము, సత్సంగము యొక్క ప్రభావము మనందరికీ విదితమే. ఆ సత్సంగ విశేషములను మిళితం చేసి, నారదమహర్షి ఈ భక్తి సూత్రములలో ప్రసాదిస్తున్నారు.

**పిబత భాగవతం రసమాలయం** అన్న విధముగా ఈ భక్తి సూత్రములలో దాగివున్న భాగవత తత్వమును, సత్సంగ సారమును ఆస్వాదించడం ఇక సాధకులమైన మనందరి వంతు.

- సశేషం

**పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు**

***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**నవంబర్ 2023**

7 మంగళ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

12 ఆది: నరకచతుర్దశి, దీపావళి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

27 సోమ: కార్తీక (గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

30 గురు: శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం

**డిశంబరు 2023**

7 గురు: శ్రీ గురుదశమి - శ్రీ గురుదేవుల వార్షిక పుణ్యారాధన. శ్రీ సద్గురు పాదపూజ

17 ఆది: ధనుర్మాస వ్రత ప్రారంభం - ధనుర్మాసంలో ప్రతిరోజు ఉ. 5.00 గం.లకు శ్రీ సద్గురుపాదపూజ

23 శని: ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి - శ్రీ సద్గురు పాదపూజ

26 మంగళ: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**నవంబర్ 2023**

7 మంగళ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

11 శని: మాసశివరాత్రి

12 ఆది: నరకచతుర్దశి, దీపావళి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 సోమ: అమావాస్య - అభిషేకములు

14 మంగళ: కార్తీక శుద్ధ పాడ్యమి - ఆకాశదీపం

15 బుధ: నవంబరు 15 నుండి 23 వరకు - శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన

17 శుక్ర: నాగుల చవితి

23 గురు: చిలుక ఏకాదశి - ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన

24 శుక్ర: క్షీరాబ్ది ద్వాదశి - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

26 ఆది: జ్వాలాతోరణం - శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం

27 సోమ: కార్తీక (గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

30 గురు: కార్తీక బహుళ తదియ, శ్రీ సద్గురుదేవుల 35వ వార్షిక పుణ్యారాధన (డిశంబరు 7 వరకు) ప్రారంభం - ఉ.9.09 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7.00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన

**డిసెంబర్ 2023**

7 గురు: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ, దీపోత్సవం. శ్రీ గురుసాంప్రదాయములో వారికి శ్రీ సద్గురు మహాపుణ్యారాధన

8 శుక్ర: శ్రీ సద్గురు దీక్షలో ఉన్నవారికి హోమం

9 శని: హోమం పూర్ణాహుతి, దీక్షావిరమణ

11 సోమ: మాసశివరాత్రి

12 మంగళ: అమావాస్య

17 ఆది: ధనుర్మాస వ్రత ప్రారంభం - తిరుప్పావై, ఋషులచరిత్ర, భాగవత ప్రవచనం

18 సోమ: సుబ్రహ్మణ్య షష్టి

23 శని: ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి - శ్రీమద్భగవద్గీత పారాయణ, ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 సోమ: క్రిస్మస్ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

26 మంగళ: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - శ్రీ సద్గురు పాదపూజ

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

29. **రూపములు చూచువేళల రూపములో వెలుగు రాము రూపము నీలో**
**జూపని తద్రూపము జిద్రూపముగా జూడు ప్రకృతి ద్రోయుచు మనసా.**

తాత్పర్యము: ప్రకృతి యందు గల అన్ని సౌందర్యములకు హేతువు నీ అంతరంగమందున్న చిత్ రూపమే అని ఎరిగి, రూపదర్శనమునకు ఆధారమగు శ్రీరాముడనే వెలుగు అని తెలిసికొని ప్రకృతిని వదలి చరించుము మనసా.

30. **రుచు లనుభవించు వేళల, రుచి జిహ్వల విడిచి ప్రకృతి రూపమగు నీతో**
**రుచులాను రామచంద్రుని, రుచిజిహ్వల నడుమ జూడు రుచిగొని మనసా.**

తాత్పర్యము: జిహ్వకు లభించే రుచులన్నీ శ్రీరాముని దయ వలననే అని గుర్తెరిగి ప్రకృతిని తలపక సుస్థిరము, రుచికరము అయిన శ్రీరాముని స్థిరముగ నిలుపు మనసా.

31. **గంధంబులు గొనువేళల, గంధఘ్రాణముల ప్రకృతిగా గని నీతో**
**గంధము గొనియెడి రాముని, బంధుర తేజుని భజింపు పాయక మనసా.**

తాత్పర్యము: మనస్సు సంతస పరచు ఘ్రాణ ఇంద్రియముల సువాసనలు ప్రకృతి మాయలని తెలిసికొని నీతో సేవలుగొను అత్మబంధుడు శ్రీరాముని విడువకు మనసా.

32. **పదపడి జితేంద్రియములను, బోదలెడి నినుగూడి విషయ భోగంబుల సం**
**పద లనుభవించు రాముని, వెదకుము విషయేంద్రియముల విడువక**
**మనసా.**

తాత్పర్యము: ఇంద్రియ సుఖములకు ఆధారమగు ఆత్మా రాముడిని తెలుసుకొని ప్రకృతిని చరించుము జితేంద్రియుడవై మానసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

మరుసటి దినమున సుమంత్రుడు రాజ్యమునకు తిరిగి వచ్చాడు. ఆతనిద్వారా విషయములను తెలుసుకొనిన దశరథుడు మరల మూర్ఛబోయాడు. రాముని ఎడబాటు సహించలేని దశరథుడు రాముడు వెళ్ళిపోయిన మరుసటి రెండు దినముల తరువాత స్వర్గలోకమునకు చేరుకున్నాడు. భరతునికి, శత్రుఘ్నునికి తండ్రి మరణవార్త తెలియపరచి రప్పించారు. జరిగినదంతా తెలుసుకున్న భరతుడు ఉగ్రుడై, తనకు కళంకమును తెచ్చిపెట్టిన తన తల్లిని పలువిధములుగ తూలనాడాడు. కైకేయి వాటన్నింటినీ ఓర్పుతో సహించి, తన పుత్రుని ఉన్నతమైన హృదయము తెలుసుకున్నదై మిక్కిలి సంతోషించింది.

భరతుడు పిదప కౌసల్య భవనమునకు వెళ్ళాడు. ఆ పట్టపురాణి భరతుడు తన వద్దకు రాజ్య పట్టాభిషేకమును కోరి వచ్చుచున్నాడని తలచి "నీవు, నీ తల్లీ రాజమకుటము నపహరింప గోరి, మహారాజును బాధకు గురిచేసి హత్య గావించారు. నీవు రాజగుట నాకు సంతోషకరమే. కానీ దాని కొరకు నా పుత్రుని వనవాసం చేయమని అడవికి పంపవలయునా?" అని కన్నీరు మున్నీరై ప్రశ్నించింది.

"తల్లీ! నన్ను మిక్కిలి ప్రేమతో పెంచిన మీరు ఇవ్విధమైన కఠిన పదజాలమును నాపై ప్రయోగించవచ్చునా? నేను మీ మందిరమునకు వచ్చిన కారణం మీ అనుమతితో అన్నయ్య రాముని మరల అయోధ్యకు తీసుకుని వచ్చెదనని తెలియజేయుటకే" అని విలవిల పోయాడు. "నాయొక్క తల్లి ఒనరించిన ఈ పాపకార్యమందు నాకు ఏదేని భాగమున్నచో పలు పాతకములు చేసిన మానవులు జేరు మండే పాతాళ లోకమునకు నేను కూడ చేరుకుంటాను" అన్నాడు.

అదియేగాక రాముడు అయోధ్యకు తిరిగి రాకపోయినట్లైతే నేను కూడా ఈ మహానగరము వైపుకు ఎన్నటికీ రాను" అని కట్టుదిట్టంగా చెప్పాడు. భరతుని హృదయములోనున్న నిజమైన

భావమును అర్థం చేసుకున్న కైకేయి ఆతనిని అనునయించు విధమున "కుమారా! పుత్ర పాశము చేత నానుండి వెలువడిన నా మాటలను నీవు మనసులో పెట్టుకోవద్దు" అన్నది. చెంతనున్న సుమిత్ర కూడా కలత చెందిన మనసుతో, "నీయొక్క ప్రయత్నం సఫలీకృతమగు గాక!" అని భరతుడ్ని ఆశీర్వదించి పంపింది.

అయోధ్య మహారాజు యొక్క మరణానంతర కార్యములు ముగిసిన పిదప, వశిష్టులు భరతునికి పట్టాభిషేక మొనరించమని కోరారు. భరతుడు దానికి నిరాకరించి, తాను అడవికి వెళ్ళి తన అన్నగారైన రాముని మరల తమ దేశమునకు తీసుకుని వచ్చెదనని సైన్యమును వెంటబెట్టుకొని బయలుదేరాడు. ఈ విషయము నాలకించిన వశిష్టాది మహామునులు, వృద్ధులైన మంత్రులు మరియు పుర ప్రజలు మిక్కిలి ఆనందించారు. వారందరూ తనవెంట రాగా తన సైన్యముతో భరతుడు అడవివైపుకు తన పయనమును కొనసాగించి వాళ్ళు గంగా నదిని చేరుకున్నారు. అప్పుడు భరతుడి రాకను గమనించిన నిషాద రాజైన గుహుడు తన బంధువులని, సైన్యాన్ని, యువకులని పిలిచి ఇలా అన్నాడు:

**యదా తుష్టః తు భరతః రామస్య ఇహ భవిష్యతి ।**
**సా ఇయం స్వస్తిమయీ సేనా గంగాం అద్య తరిష్యతి ॥**

"భరతుడు ఇంత సైన్యంతో వచ్చాడంటే, ఖచ్చితంగా మనందరినీ చంపడం కోసమైనా వచ్చి ఉండాలి, లేదా 14 సంవత్సరాల తరువాత రాముడు తిరిగి వస్తే ఆయన పరాక్రమము ముందు తాను నిలబడలేనని, ఇదే అదునుగా ఒక్కడే ఉన్న రాముడిని, లక్ష్మణుడిని సంహరించడం కోసమైనా వచ్చి ఉండాలి. రాముడు నాకు పరమ మిత్రుడు, ఆయనని మనం రక్షించుకోవాలి. ఇంత పెద్ద సైన్యాన్ని మనం ఎదిరించలేము, కాకపోతే మన సహాయం లేకుండా వీళ్ళు ఎవరూ గంగని దాటలేరు.

- సశేషం

# సప్త జ్ఞాన భూమికలు

సేకరణ- కీ.శే. యమ్. జానకిరామ శాస్త్రి

మానవాళిలో రెండు రకాల వారున్నారుః 1.జ్ఞానులు, 2.అజ్ఞానులు.

జ్ఞానంలో ఏడు స్థితులు ఉన్నాయి. వీటినే సప్తజ్ఞాన భూమికలు అంటాం. 1.శుభేచ్ఛ, 2.విచారణ, 3.తనుమానసం, 4.సత్త్వాపత్తి, 5.అసంసక్తి, 6.పదార్థ భావని, 7.తురీయం.

1."శుభేచ్ఛ" : "నాకు బ్రహ్మజ్ఞానం కావాలి" అన్న ఇచ్ఛ, "నేను శాశ్వత దుఃఖరాహిత్య పదవి పొందాలి" అన్న తీవ్ర ఆకాంక్ష.

2."విచారణ"ః "బ్రహ్మజ్ఞాన ప్రాప్తి ఏ విధంగా పొందాలి" అన్న మీమాంస, బ్రహ్మ జ్ఞాన ప్రాప్తి విధానం - ధ్యానం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం అని తెలుసుకోవడం."

3."తనుమానసం"ః ఇంక విచారణ ద్వారా సాధనా మార్గం తెలుసుకున్నాం గనుక, "తత్" సాధనలో నిమగ్నులై ఉండడమే "తనుమానసం". అంటే "తత్" సాధనలో నిమగ్నులై ఉండడమే! అంటే ధ్యాన, స్వాధ్యాయ, సజ్జన సాంగత్యాలకు ఏ రోజూ విఘ్నం లేకుండా గడపడం. అదే "తనుమానసం".

4."సత్త్వాపత్తి"ః శుద్ధసాత్వికం సాధించడమే "సత్త్వాపత్తి" అంటే ఇప్పుడు తమోగుణం, రజోగుణం, అన్నవి పూర్తిగా శూన్యమైన స్థితి. "అహం బ్రహ్మోస్మి"అని చక్కగా సిద్ధాంతపరంగా తెలుసుకున్న స్థితి. "బ్రహ్మ విదుడు" అయిన స్థితి.

5."అసంసక్తి" : దివ్య చక్షువు ఉత్తేజితమవుతూన్న స్థితి. "తనువు మరి సంసారం రెండూ తాత్కాలికమైనవే" అని సంపూర్ణంగా తెలుసుకున్న స్థితి. కనుక, ఈ రెండింటి మీదా పూర్తిగా అనాసక్తి పొందిన స్థితి, అదే "అసంసక్తి". "దీన్నే" "పద్మపత్రమివాంభసా" అన్నాడు కృష్ణుడు గీతలో.

అయితే ఇతనికి సంసారంలో అసంసక్తి ఉన్నా ధర్మనిష్టుడు, మరియు కర్మ నిష్టుడు, తనువు పట్లా మరి సంసారం పట్లా, తటస్థ దృష్టి కలిగి ఉన్నవాడు. దివ్య చక్షువు ఉత్తేజితమైంది కనుక, "సత్యద్రష్ట" కాబోతున్నాడు. కనుక, పూర్తిగా దాని మీదే ఆసక్తినీ, ఏకాగ్రతనూ నిలిపినవాడు. ఇదే "అసంసక్తి". ఇతనినే "బ్రహ్మ విద్వరుడు" అంటాం.

6.“పదార్థభావని”: అంటే దివ్యచక్షువును క్షుణ్ణంగా ఉపయోగించు కుంటున్నవాడు. ప్రతి “పదం” యొక్క “అర్థం”లో ప్రతి “వస్తువు”యొక్క “భావం”లో ప్రత్యక్షంగా నివసిస్తున్న వాడు. అంటే “బ్రహ్మ విద్వరీయుడు” అయిన స్థితి. ఇదే “సిద్ధ స్థితి”, ఇదే “సవికల్ప సమాధి స్థితి” కూడా. అంటే ఎన్నో సమాధానాలు దొరికినా ఇంకా కొద్దిగా, సంశయాలు వున్న స్థితి.

7.“తురీయం”: ఇది మానవుని యొక్క “పూర్ణ వికాస స్థితి”. సిద్ధుడు “బుద్ధుడు” అయిన స్థితి. అందరినీ యోగులుగా, సిద్ధులుగా, బుద్ధులుగా మలచడానికి కంకణం కట్టుకుని తత్ పరిశ్రమలో పూర్తిగా నిమగ్నమై ఉన్నవాళ్ళనే “బుద్ధులు” అంటాం. ఇదే “సహస్ర దళ కమలం”, ఇదే “వేయి పడగల పాము”. ఒక్కొక్క మనిషినీ యోగిగా మలచినప్పుడల్లా సహస్ర దళ కమలంలో ఒక్కొక్క రేకు విచ్చుకుంటుంది. ఇతనినే “బ్రహ్మ విద్వరిష్టుడు” అంటాం.

“తురీయం” అంటే సర్వసామాన్యమైన జాగ్రత, స్వప్న, సుషుప్త, స్థితులను దాటినవాడు. “తురీయ” అంటే “ మూడింటిని దాటిన” అని అర్థం. అంటే “నిర్వికల్ప సమాధిస్థితి”కి చేరుకున్న స్థితి. “సమాధి” అంటే “సమాధానాలు తెలుసుకున్న స్థితి”. నిర్వికల్ప సమాధి అంటే “ఏ సందేహాలూ, ఏ సంశయాలూ, లేని స్థితి.”



# బిచ్చగాడు

ఒక గ్రామంలో బిచ్చగాడు ప్రతి ఇంటికి వెళ్ళి బిచ్చమెత్తుకుంటూ ఉండేవాడు. ఒకరోజు ఒక ఇంటి వద్ద 'భవతీ భిక్షాం దేహి మాతా అన్నపూర్ణేశ్వరీ!' అని అడిగాడు. ఆ ఇంటి యజమాని పండితుడు. అతను అరుగుమీద కూర్చుని పారాయణ చేసుకుంటూ ఉన్నాడు. ఆ ఇల్లాలికి వినిపించ లేదేమో అని బిచ్చగాడు గట్టిగా మళ్ళీ 'భవతీ భిక్షాం దేహి మాతా అన్నపూర్ణేశ్వరి!' అని అన్నాడు. పండితుడికి కోపం వచ్చింది. నేనిక్కడ ఉండగా నాతో మాట్లాడకుండా నాకు చెప్పకుండా ఇంత నేను సంపాదిస్తుంటే ఆమెను పిలిచి బిచ్చం అడుగుతాడా. వీనికి తగిన శాస్తి చేస్తాను అని అనుకుని, వెంటనే 'ఏమేవ్! మూడు జన్మల ముష్టివాడు వచ్చాడు బిచ్చం వెయ్యి' అని గట్టిగా అరిచాడు.

ఆ గొంతు పోల్చుకున్న ఆమె భర్తకి కోపం వచ్చిందని గ్రహించి వెంటనే బియ్యం తీసుకొచ్చి బిచ్చగాడి పాత్రలో వేసి ఆవిడ వెంటనే లోపలకు వెళ్ళిపోయింది. కానీ బిచ్చగాడు మాత్రం కదల్లేదు. అతని చేతిలో కర్ర కూడా ఉంది. అప్పుడు పండితుడికి అనుమానం అలజడి మొదలయ్యింది. అకారణంగా నేను అన్న మాటలు వీడికి బాధ కలిగించాయి. వీడిపుడు ఏంచేస్తాడు తిడతాడా లేదా ఇంకా ఏం చేస్తాడో అని లోలోపల బాధ పడుతూ చూస్తున్నాడు.

ఇంతలో బిచ్చగాడు 'ఏమండీ' అని పిల్చాడు. 'ఆఁఉ!!' అంటూ చిన్న అహంకారాన్ని ప్రదర్శించాడు పండితుడు. 'ఏం లేదు మీరు నన్ను మూడు జన్మలు ముష్టి వాడన్నారు అది ఎలాగా?' అన్నాడు. 'అదా? దానికేముంది. తెలుసుకోవాలి అనుకుంటున్నావా? అయితే ఇలా కూర్చో' అన్నాడు. 'ఫరవాలేదు చెప్పండి నిలబడతాను' అన్నాడు.

**అదత్త దానాచ్చ భవేత్ దరిద్రః దరిద్ర దానాచ్చ కరోతి పాపం?**
**పాప ప్రభావాత్ పునర్దరిద్రః పునర్దరిద్రః పునరేవ పాపీ?** ................అని శ్లోకం చదివాడు. వెంటనే బిచ్చగాడు 'అయ్యా! మీరు చదివిన శ్లోకానికి అర్థం నాకు తెలియదు. నాకు అర్థమయ్యేటట్లు మాటల్లో చెప్పండి' అన్నాడు. 'నువ్వు గత జన్మలో ఎవరికీ ఏమీ ఇవ్వలేదు. అంటే రెండు కారణాలు. నీకు లేకపోయి వుండొచ్చు. ఉండి కూడా దానం చేయక పోయుండచ్చు. లేకపోతే గతజన్మలో నువ్వు ముష్టి వాడివి కాబట్టి ఆ ఫలితంగా నువ్వు

ఈ జన్మలో కూడా ముష్టి వాడిగా అయిపోయావు. అంటే రెండు జన్మలు ముష్టివాడివి'.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**నవంబర్ 2023**

7 మంగళ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

11 శని: నరకచతుర్దశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

12 ఆది: దీపావళి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 శుక్ర: నాగుల చవితి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 గురు: చిలుక ఏకాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

24 శుక్ర: క్షీరాబ్ధి ద్వాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

27 సోమ: కార్తీక (గురు)పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

30 గురు: శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం

**డిసెంబర్ 2023**

3 ఆది: శ్రీ గురుదేవులు స్వస్వరూపలయం చెందిన తేదీ - ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

7 గురు: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 ఆది: ధనుర్మాస వ్రత ప్రారంభం

18 సోమ: సుబ్రహ్మణ్య షష్టి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

23 శని: ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 సోమ: క్రిస్మస్ - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

26 మంగళ: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి - సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

# గురు కృపకు అందరూ సమానులే

- షేక్ బాజీ

గురు కృపకు హెచ్చు తగ్గులు లేవు, వారూ వీరూ అనే భేదం లేదు. అందరూ ఒక్కటే. నమ్ముకున్నవారికి నమ్ముకున్నంత ఫలితం. ఈ సంగతి నా విషయంలో ఋజువు అయింది. ఇది నా జీవితంలో సువర్ణ అక్షరాలలో లిఖించవలసిన 'శ్రీబాబు గారితో నా అనుభవం!' ఎప్పటికీ మరువలేను. ఇది ఎప్పుడు తలచుకున్నా నా మనస్సు ఆనందడోలిక వూగుతుంది.

సుమారు 15 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన. నేను నంబూరు రైల్వేస్టేషన్ దగ్గర వెంగళరావు నగర్‌లో నివసిస్తూ, ఆటో నడుపుతూ వుంటాను. ఒకరోజున 'సమర్థ సద్గురు' మాసపత్రికలు ఆటోలో తీసుకువెళ్ళి గుంటూరు పోస్టు ఆఫీసులో ఇవ్వడానికై నన్ను పిలిచారు. ఆ రోజు నాకు విపరీతమైన జ్వరం. అయినాగానీ, పిలిచారు కాబట్టి, గుంటూరు వెళ్ళాలని నిర్ణయించుకుని ఆశ్రమానికి వచ్చాను. మధ్యాహ్నం సుమారు 12 గంటలు అయింది. బాబు విజ్ఞానమందిర్ అరుగు మీద పుస్తకాలు కట్టలు కడుతున్నారు. నేను కాస్త దూరంగా ఆటో దగ్గర నీరసంగా నిలబడి ఉన్నాను.

"ఇక్కడి తీర్థం త్రాగితే సర్వ రోగాలు హరిస్తాయి' అంటారు కదా! నాకు ఎవరైనా కాస్త తీర్థం ఇస్తే బాగుంటుంది, నా జ్వరం తగ్గుతుంది కదా!' అని మనస్సులో అనుకున్నాను. కానీ, ఎవ్వరికీ చెప్పలేదు, నేనేమీ ప్రయత్నం చేయలేదు. ఇంతలో ఎవరో ఒక భక్తురాలు వచ్చి, 'ఇదిగో! తీర్థం. మొత్తం నీకే తీసుకో' అని ఒక గ్లాసునిండా తీర్థం ఇచ్చారు. నేను ఆశ్చర్యపోయాను! తన్నితే బూరెల బుట్టలో పడ్డట్లుగా వున్నది నా పరిస్థితి. సాధారణంగా తీర్థం ఒక చెంచాతో ఇస్తారు కదా! కానీ, నాకు గ్లాసునిండా వచ్చింది! ఆనందం పట్టలేక గడగడా మొత్తం త్రాగి, గ్లాసు ఖాళీ చేశాను. తీర్థం ఇచ్చిన భక్తురాలికి నమస్కరించాను. ప్రయత్నం లేకుండా నా కోరిక తీరింది. బాబుగారి దయ నా మీద వున్నది కాబట్టి నేను అదృష్టవంతుడిని.

కాస్సేపటికి, చేతితో తీసివేసినట్లుగా జ్వరం మాయమైంది. ఎంతో హుషారుగా పుస్తకాలు ఆటోలో వేసుకుని గుంటూరు వెళ్ళాను.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీకొండ ఈశ్వరరాజుగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

భగవానుడు అవతారం ధరించి వచ్చేటప్పుడు , ఆ అవతారంలో తాను యే యే జీవులను తరింపజేయాలో ముందుగానే ప్రణాళిక వేసుకుని వస్తాడు. ఆయా జీవులందరి పూర్వ చరిత్రలూ ఆయనకు కరతలామలకమే. వాటికి అణుగుణంగానే, ఆ యా జీవులను తరింపజేయ వలసిన విధానాలన్నీ కూడా నిర్ణయించుకుని మరీ అవతరిస్తాడు. కనుకనే శ్రీ కృష్ణభగవానుడు అర్జునునికి గీతోపదేశం చేస్తూ,



**బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తాన్యహం వేద సర్వాణి । నత్వం వేత్థ పరంతప ॥**

"అర్జునా! నీకూ నాకూ ఎన్నో జన్మల నుండి సంబంధమున్నది. అవన్నీ నాకు తెలుసు. నీకు తెలియదు" అన్నాడు. శ్రీ బాబు కూడా భక్తులకు తమ దివ్య బోధామృతాన్ని అందిస్తూ, మధ్యలో "మీరందరూ ఎన్నెన్నో కోరికలతోను, సంకల్పాలతోను నా దగ్గరకు వస్తారు. అందులో మీకు శ్రేయస్సును కలిగించేవి ఏవో, అపకారం చేసేవేవో, మీకు తెలియదు. నాకు తెలుసు. కోరినది పొందలేక పోయామని బాధ మీది. మీ మీద ప్రేమ కొద్దీ మీరు అడిగినవన్నీ యిస్తూపోతే , మీరు ఎక్కడ అధఃపతనానికి దిగజారిపోతారో అనే బాధ నాది. తెలిసిన తిప్పలు నావి, తెలియని తిప్పలు మీవి. రోగికి రోగం తగ్గాలంటే శస్త్ర చికిత్స కావాలి. శస్త్ర చికిత్సను తప్పించుకోవాలని రోగి చూస్తాడు. రోగం తగ్గించి ఆరోగ్యాన్ని ఎలా చేకూర్చాలా అని వైద్యుడు చూస్తాడు. రోగివి తెలియని తిప్పలు, వైద్యుడివి తెలిసిన తిప్పలు" అని చెబుతూ ఉండే వారు.

చిరంజీవిరాజుగారి తల్లి శేషమాంబగారు పూర్ణ దీక్షితురాలు. ఆమె సోదరులైన కొండ ఈశ్వరరాజుగారు ఆమె వద్ద నుండి మంత్రదీక్షను పొందినవారు. పొలంలో దిగి కష్టపడి పనులు చేయటంలోను, చేయించటంలోను ఆయన సింహమే. కాని దీక్ష తీసుకున్న తరువాత కూడ కొంతకాలం వరకు ఆయన భగవచ్చింతన మాట అటుంచి, భగవద్గీత అంటే ఏమిటో కూడ తెలియని వారు. కనుక , ఆ 'భగవద్గీత'తోనే శ్రీ బాబు ఈశ్వరరాజుగారి జీవితంలో చోటు చేసుకున్నారు. అదొక విచిత్రమైన దైవ సంఘటన.

ఒకప్పుడు చిరంజీవి రాజుగారు సకుటుంబంగా శ్రీ బాబుతో రామేశ్వర యాత్రకు సంకల్పించారు. శేషమాంబగారి ప్రోద్బలంతో ఈశ్వరరాజుగారు కూడ ప్రయాణమైనారు. బెజవాడ స్టేషనులో ఈశ్వరరాజుగారు రైలులో కూర్చొని ఉండగా, శ్రీ బాబు వారి వద్దకు వచ్చి, "తమరికి కొంచెం కాలక్షేపంగా ఉండటానికి ఏదైన ఒక మంచి పుస్తకం తెచ్చుకోండి" అన్నారు. ఈశ్వరరాజుగారు ప్లాట్ ఫారం మీద ఉన్న పుస్తకాల షాపుకు వెళ్ళి "ఏదైనా ఒక మంచి పుస్తకం యివ్వ"మన్నారు. షాపు అతను "భగవద్గీత యివ్వమంటారా?" అని అడిగాడు. "భగవద్గీతా? అంటే ఏమిటి? దేనిని గురించి వ్రాసి వుంటుంది దానిలో" అని ఈశ్వరరాజు గారు అడిగారు. షాపు అతనికి మాత్రం ఏం తెలుసు, అందులో ఏముంటుందో? అయినా కొంచెం డాబుగా "అయ్యో! భగవద్గీతనే ఎరుగరా? చాలా మంచి పుస్తకమండీ. పెద్ద పెద్ద వాళ్ళు చాలమంది కొంటారు. తమరు తీసుకొని చూడండి" అని ఒక భగవద్గీత పుస్తకం యిచ్చాడు. ఈశ్వరరాజుగారు అది తీసుకుని, పేజీలు తిరగేసి చూశారు గాని, ఏమీ కొరుకుడు పడలేదు. వెనుకనుండి శ్రీ బాబు "ఇంకేం రాజుగారూ? ఏది మానవ జీవితంలోనే గొప్ప మార్పును కలిగించి, అతని దృష్టిని భగవంతుని వైపు మరల్చ గలదో ఆ పుస్తకమే మీ చేతికి వచ్చింది. చాల సంతోషం. ఇది భగవదేచ్ఛ అని గ్రహించండి" అన్నారు.

- సశేషం

## విస్మృత కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

**రంగనాధస్వామి**

సమర్థులు జరండేశ్వరిలో ఉండగా, శివాజి వారిని సతారాకు ఆహ్వానించారు. సమర్థులు సతారాలో ఉన్నారని తెలిసి, రంగనాధస్వామి ఆయనను కలుసుకోవాలనే ఆతురతతో సతారా చేరుకొన్నారు. ఆయన సరాసరి శివాజీ కోటకు వచ్చాడు. ఆయన విలువైన బట్టలు ధరించి ఉన్నారు. ఖరీదైన తలపాగా పెట్టుకున్నారు. చేతిలో ధనుర్బాణాలు ఉన్నాయి. “ఎవరు మీరు?” అన్నారు శివాజీ. “నేను రంగనాధస్వామిని. వీళ్ళు నా శిష్యులు” అన్నారు. శివాజీ తనలో, “ఈయన వేషంచూస్తే పగటి వేషగాడిలాగా ఉన్నాడు. సాధువులాగా కాక వేషగాడిలా ఉన్నాడు” అనుకొని, “ఏం పనిమీద వచ్చారు?” అని అడిగాడు. “సమర్థుల దర్శనం కోసం” అన్నారు రంగనాధ స్వామి. శివాజీకి నవ్వు వచ్చింది. వచ్చే నవ్వును ఆపుకుంటూ, “ఇక్కడే ఉండండి. కబురు పంపుతాను”” అన్నాడు.

“అలాగే కాని, మా శిష్యులు, మేము చాలా దూరంనుంచి వచ్చాము. మాకు భోజనాలు ఏర్పాటు చేయమని సమర్థులకు తెలియజేయండి” అన్నాడు రంగనాధస్వామి. “ఈయన ఎవరో భోక్త స్వామిలాగా ఉన్నాడు. ఈయనకు సమర్థుల దర్శనమా?” అనుకొని శివాజీ సమర్థుల వద్దకు వచ్చాడు. ఆ లోపే సమర్థులు, రంగనాధస్వామి రాకను గ్రహించి వారికి వంట ప్రయత్నాలు చేయడానికి సిద్ధమైనారు. శివాజీ సమర్థులకు నమస్కరించి, “స్వామీ! ఎవరో రంగనాధస్వామి అట. మీ దర్శనం కోసం వచ్చాడు” అన్నాడు.

“ఎలా ఉంటాడు?” అని అడిగారు సమర్థులు. “ఠీవిగా బట్టలు వేసుకొన్నాడు. ఖరీదైన పాగా. చేతిలో ధనుర్బాణాలు. వేషం సాధువు వేషమే. కాని మోసగాడిలాగా ఉన్నాడు” అని జవాబిచ్చాడు శివాజీ. “ఓహో! రంగోబానా? వాడు వట్టి భ్రష్టుడు. వాడిక్కడకు ఎందుకు వచ్చాడు?” “మిమ్మల్ని చూడటానికట” అన్నాడు శివాజీ వినయంగా. “నీవు శివాజీ అన్న సంగతి ఆ నీచుడికి తెలియదు.

నాకు తీరిక లేదని చెప్పలేకపోయావా?" అన్నారు. సమర్థులు. "అలాగే చెబుదామనుకున్నాను. కాని ఆయన మిమ్మల్ని చూడాలనే పట్టుదలతో ఉన్నాడు. పైగా, తనకు, తన శిష్యులకు భోజనాలు ఏర్పాటు చేయమన్నాడు" అన్నాడు శివాజీ.

"హరి భ్రష్టుడా! నీకు భోజన ఏర్పాట్లు చేయాలా? నీతో పాటు నేను పంక్తిలో కూర్చుని నేను భ్రష్టుడిని కావాలా? మేము దర్శనం ఇవ్వదలచుకోలేదని, భోజనాలు వీలు కాదని చెప్పు. వీడి వేషాలు పై పైకే. లోపల అన్నీ నీచగుణాలు." శివాజీ సిపాయితో కబురు చేశాడు. సిపాయిని చూసి రంగనాథస్వామి, "మాకు భోజనాలు, దర్శనం లేవన్నారు కదూ!" అన్నారు. "పరవాలేదు. మా వంట ఏర్పాటు మేము చేసుకుంటాం. సాయంత్రానికి వెళ్ళిపోతాం" అన్నారు రంగనాథులు. ఆయన శిష్యులతో, "రుచికరమైన భోజనం దొరుకుతుందన్న ఆశ అడియాస అయింది. దొడ్లో కాయగూరలన్నా, ఆకుకూరలన్నా ఉన్నాయేమో చూడండి. అన్నారు. శిష్యులు చూసి, "దొడ్లో ఏమీ లేదు. ఒక దున్నపోతు కట్టబడి ఉంది" అన్నారు శిష్యులు. "దున్నపోతా భలే! చాలా రోజులైంది మాంసం తిని. దానిని నరికి వండుకుందాం" అని గబగబా దాని దగ్గరకు వెళ్లి చాకుతో ఒక్కవేటుతో దాని తల నరికాడు రంగనాథ్. అక్కడ నిలబడ్డ సిపాయిపై రక్తం పడింది. అతని కాళ్ళు, చేతులు వణికాయి. అతను వడివడిగా సమర్థుల వద్దకు వచ్చి జరిగిందంతా చెప్పాడు. "ఓరి దరిద్రుడా! దున్నపోతుని చంపావా? ఉండు నీ పని చెబుతా" అంటూ ఉత్తరీయం ధరించి బయల్దేరారు సమర్థులు. ఆయన వెంట ఐదారుగురున్నారు. అక్కడకు వెళ్లి, "రంగోబా!" అని పిలిచారు సమర్థులు. రంగోబా బయటకు వచ్చి సమర్థుల కాళ్ళపై పడి, "స్వామీ! మీ దర్శనం కోసం నా మనస్సు తహతహలాడిపోతోంది" అని ఆయనను లోపలికి తీసుకొని వెళ్లి మనసారా పూజించాడు రంగోబా. "ఓహెూ! ఇవ్వాళ భక్తి విశేషంగా పుట్టుకొచ్చిందే" అన్నారు సమర్థులు. "స్వామీ! మీ లాంటి అసమానమైన అతిథి వచ్చినప్పుడు పూజించే అవకాశాన్ని ఎలా వదులుకోను?" అన్నాడు. అతని కనులు వర్షిస్తున్నాయి. "అంటే ఇప్పుడే నీతోపాటు నైవేద్యం తిని నేను భ్రష్టుడనవ్వాలనా?" అన్నారు సమర్థులు. "మీకిష్టమైతేనే తినండి. కాని మా పూజను నిరాకరించకండి" అన్నాడు రంగోబా.

- సశేషం

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.

Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

# అక్టోబరు 15 నుండి 25 వరకు
# ఆశ్రమంలో జరిగిన దసరా ఉత్సవాల దృశ్యములు



నృత్య ప్రదర్శన చేసిన
ఆశ్రమ బాలికలతో శ్రీ మాతాజీ



సామూహిక
కుంకుమ పూజలు



తీర్థ ప్రసాద స్వీకరణ



అక్షతలతో శ్రీ మాతాజీ
భక్తులను దీవించుట

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

## అక్టోబరు 15 నుండి 25 వరకు
## ఆశ్రమంలో జరిగిన దసరా ఉత్సవాల దృశ్యములు



శ్రీ సద్గురు పాదపూజ



అమ్మవారి రథోత్సవ దృశ్యము

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.